నవతెలంగాణ

1

నిజామాబాద్-కామారెడ్డి

మంగళవారం | అక్టోబర్ 01 2024 | www.navatelangana.com

డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికేషన్‌ల వెరిఫికేషన్

- నేటి నుంచి 5వ తేదీ వరకు : డీఈవో

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

డీఎస్సీ-2024 ద్వారా 1:3 పద్దతిలో ఎంపికైన అభ్యర్థులకు వారి ఫోన్‌కు కాని, ఈమెయిల్‌కు కాని వెరిఫికేషన్ కోసం మెసేజ్ వచ్చిన అభ్యర్థులు ఆన్ లైన్ లో వెరిఫికేషన్ ఫామ్ డౌన్‌లోడ్ చేసుకొని పూరించి సమర్పిసంచాలని డీఈవో దుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారరు. నేటి 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఒరిజినల్ ధ్రువపత్రాలను గెజిటెడ్ ఆఫీసర్‌చే ధృవీకరింపబడిన 2 జతల జిరాక్స్ కాఫీలను జత చేసి జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని రూమ్ నంబర్ 103 నందు హాజరై తమ ధ్రువపత్రాలను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు.

డీఎస్సీ ఫలితాల్లో మద్దికుంట వాసుల ప్రతిభ

నవతెలంగాణ-రామారెడ్డి


గజ్జల రవి


చెన్న తిరుపతి


తోట రంజిత్

తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని మద్దికుంటలో ముగ్గురు డీఎస్సీలో అర్హత సాధించారు. చెన్న తిరుపతి అడవి శాఖలో బీట్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. గజ్జల రవి వివి టీచర్ గా పని చేశారు. తోట రంజిత్ ప్రైవేట్ పాఠశాలను నడుపుతున్నారు. రాత్రింబవళ్లు చదివి ఉపాధ్యాయ వృత్తికి ఎంపిక కావడంపై అభ్యర్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. మిత్రులు, గ్రామస్తులు వారిని అభినందించారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత

- జిల్లా స్థాయి సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణరావు
- ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలుపై దిశానిర్దేశం
- సంక్షేమం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది.. అధికారులు జవాబుదారీగా ఉండాలని సూచన

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ పనితీరులో స్పష్టమైన మార్పు తెస్తామని జిల్లా ఇంచార్జ్ మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంత్రి జూపల్లి సోమవారం నిజామాబాద్ జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ప్రగతి గురించి మంత్రి దృష్టికి తెచ్చారు. వ్యవసాయం, విద్య, వైద్యం తదితర శాఖలపై సమీక్షలో సమగ్ర చర్చ జరిపారు. జిల్లాలో 71 వేల రైతు కుటుంబాలకు రూ. 626 కోట్ల రుణమాఫీ జరిగిందని కలెక్టర్ వివరించారు. పలు సాంకేతిక కారణాల వల్ల కొంతమందికి రుణమాఫీ జరుగలేదని, ఈ విషయమై ఉన్నతాధికారులకు పరిస్థితిని వివరిస్తూ నివేదికలు పంపామని అన్నారు.

ఈ సందర్భంగా ఇంచార్జ్ మంత్రి జూపల్లి అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ, ప్రజలకు పారదర్శకమైన పాలన అందేలా కృషి చేయాలని హితవు పలికారు. పలు సాంకేతిక కారణాల వల్ల కొంతమంది రైతులకు రుణమాఫీ జరుగనందున, అలాంటి రైతులను క్షేత్రస్థాయిలో గుర్తించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఈసారి అధిక విస్తీర్ణంలో వరి పంట సాగు చేస్తున్నందున అందుకు అనుగుణంగా ఎక్కువ సంఖ్యలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట సన్న రకం, దొడ్డు రకం ధాన్యాలకు వేర్వేరుగా కేంద్రాలను నెలకొల్పాలని, ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

విద్యాశాఖపై చర్చ సందర్భంగా, మంత్రి మాట్లాడుతూ, ప్రతి ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో వసతులను మెరుగుపర్చి నాణ్యమైన విద్యా బోధన జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తద్వారా ప్రభుత్వ విద్యా సంస్థల్లో ప్రవేశాలను గణనీయంగా మెరుగుపడేలా ప్రతిఒక్కరు అంకితభావంతో కృషి చేయాలని అన్నారు. పాఠశాలలకు ఆంగ్ల, తెలుగు దినపత్రికలు అందేలా చర్యలు తీసుకోవాలని, డిక్షనరీని సమకూర్చాలని తద్వారా విద్యార్థుల్లో సామర్థ్యం పెంపొందేందుకు ఇవి దోహదపడతాయని మంత్రి జూపల్లి ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, పాఠశాలల రేషనలైజేషన్ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలని డీఈఓను ఆదేశించారు. వైద్య రంగంలోనూ స్పష్టమైన మార్పు కనిపించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు పట్ల ప్రజల్లో నమ్మకం పెంపొందేలా నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన నిధులలో కనీసం సగభాగం నిధులను విద్యా వైద్య రంగాలకు వెచ్చించాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని, అధికారులు కూడా ప్రజలకు జవాబుదారిగా ఉంటూ సమర్ధవంతంగా సేవలు అందించాలని సూచించారు.


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణరావు

పాలిటెక్నిక్ కాలేజీని ఇంజనీరింగ్ కళాశాలగా అప్ గ్రేడ్ చేస్తాం

కాగా, నిజామాబాద్ పాలిటెక్నిక్ కాలేజీని ఇంజనీరింగ్ కళాశాలగా అప్ గ్రేడ్ చేస్తామని మంత్రి జూపల్లి ప్రకటించారు. అదేవిధంగా తెలంగాణ యూనివర్సిటీకి అనుబంధంగా ఇంజనీరింగ్ కాలేజ్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన గురించి కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని అన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్ట్ ను పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా గ్రంథాలయంలో ఉద్యోగ శిక్షణార్థులకు భోజన వసతి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార సంఘాల యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, మార్క్ ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మత్తు'పై ఉక్కుపాదం

అక్రమ మద్యం, గంజాయి రవాణా, కల్తీ కల్లును ఉపేక్షించొద్దు : మంత్రి

మోర్తాడ్, భీంగల్, ఆర్మూర్ ఎక్సైజ్ స్టేషన్ల నూతన భవనాలకు ప్రారంభోత్సవాలు

నవతెలంగాణ-మోర్తాడ్/భీంగల్ రూరల్/ఆర్మూర్

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు సూచించారు. అక్రమ మద్యం, గంజాయి రవాణా, కల్తీ కల్లును నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్, భీంగల్, ఆర్మూర్‌లలో నూతనంగా నిర్మించిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ భవనాలను సోమవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీతో కలిసి లాంఛనంగా ప్రారంభోత్సవాలు చేశారు.


ఆర్మూర్‌లో ఎక్సైజ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

ప్రతి పల్లెలో గంజాయి, ఆల్ప్రాజోలం, గుడుంబా వంటి మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల ఆనవాళ్లు లేకుండా ఉక్కుపాదం మోపాలని మంత్రి ఆదేశించారు. గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అక్రమ మద్యం, గంజాయి రవాణా, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన, వాటి తనిఖీ కోసం హైదరాబాద్ నుండి ప్రత్యేక బృందాలను పంపిస్తామని మంత్రి వెల్లడించారు.


ఎన్ఎస్ఎఫ్ ఎదుట సమావేశం నిర్వహించి మాట్లాడుతున్న నాయకులు

నిజాంషుగర్ ఫ్యాక్టరీపై ప్రభుత్వం ఇంకా విధివిధానాలు ప్రకటించలే

- సీఐటీయూ జిల్లా నాయకులు కుమారస్వామి

నవతెలంగాణ-బోధన్

నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంత వరకు తన విధి విధానాలను వెల్లడించలేదని సీఐటీయూ జిల్లా నాయకులు కుమారస్వామి అన్నారు. సోమవారం నిజాం షుగర్ ఫ్యాక్టరీ గేటు ఎదుట విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంరద్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ లే ఆఫ్ చేసిన సందర్భం ప్రభుత్వానికి ప్రైవేట్ యాజమాన్యానికి మధ్య సమస్య ఉత్పన్నం కావడంతో ఇద్దరి సమస్య వల్ల కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఫ్యాక్టరీని ప్రభుత్వం నడిపిస్తుందని, కార్మికులకు పూర్తి విశ్వాసం ఉందని, కానీ అప్పటి వరకు మేము కార్మికులుగా బతకాలంటే బకాయి వేతనాలు ఇప్పించాలని వారి ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ ఓపెన్ చేస్తే పార్కింగ్ భూమి, లగూన్ ఫ్యాక్టరీ వెనకాల ఉన్న భూములు గోకరాజు, గంగరాజు పేరున రిజిస్ట్రేషన్ ఉన్నాయని, అలాంటప్పుడు ఫ్యాక్టరీని ఎలా పునరుద్ధరణ చేస్తారని సందేహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ప్రభుత్వం రాగానే ఫ్యాక్టరీ ఓపెన్ చేసి ఆదుకుంటామని హామీ ఇచ్చారని, సాధ్యా సాద్యాలపై కమిటీ వేయడంతో కార్మికులంతా హర్షం వ్యక్తం చేసినట్టు తెలిపారు.

కానీ సీఎం రేవంత్‌రెడ్డి సెప్టెంబర్ 17న భూమిపూజ చేస్తామని చెప్పి కాలయాపన చేశారని అన్నారు. రాబోయే రోజుల్లో బతుకమ్మ, దసరా, దీపావళి పండగలు ఉన్నందున కార్మికులకు బకాయి వేతనాలను అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రవిశంకర్‌గౌడ్, శ్రీనివాస్, బాలకృష్ణ, రాంబాబు బాస్కర్, రమేష్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నిరసన

నవతెలంగాణ-ఆర్మూర్



ఆర్మూర్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయ నూతన భవనం వద్ద సోమవారం రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు నిరసన చేపట్టారు. సభ్యులు లింగారెడ్డి ,దేగాం యాదగౌడ్ తదితరులు మాట్లాడుతూ ఏకకాలంలో ఎలాంటి షరతులు లేకుండా 2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తానని.. రెండు పంటలకు కలిపి 15000 రూపాయలు రైతు భరోసా ఇస్తానని హామీ ఇచ్చి అధికరణకు వచ్చి 9 మాసాలు గడుస్తున్న రైతు భరోసా కు అతిలేదు ,గతి లేదని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం రుణమాఫీలో రైతుల్ని మోసం చేసిందని మైకులు పగిలిపోయే విధంగా ఉపన్యాసాలు ఇచ్చి అధికారంలోకి రాగానే నామ్కేవాస్తే లక్ష యాభై వేల రూపాయల వరకు అందులో కూడా అందరికీ కాకుండా కొంతమేరకే రుణమాఫీ చేసి 2 లక్షల రుణమాఫీ ప్రారంభం కూడా కాలేదని ఎద్దేవా చేశారు. అన్ని పంటలకు 500 రూపాయలు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

14 వరకు డీజేల నిషేధం

- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జిల్లా వ్యాప్తంగా డీజేలు, హై సౌండ్ సిస్టమ్, స్పీకర్ల వాడకాన్ని నిషేధించినట్లు సీపీ కల్మేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ నెల సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 14 వరకు నిబంధనలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ఎలాంటి సమావేశాలు ర్యాలీలు నిర్వహించిన పోలీసుల అనుమతి తప్పనిసరి అని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గిరిరాజ్ కళాశాలలో "ప్లేస్ మెంట్ డ్రైవ్"


ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణా స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టీ ఎస్ కే సి), కెరియర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. స్టార్ పవర్జ్ డిజిటల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో టీం లీడర్, సిస్టమ్ ఆపరేటర్, ప్రాసెస్ ఆసోసియేట్స్ పోస్టులకు గాను గిరిరాజ్ కళాశాలలో డీగ్రీ ఉత్తర్నులైన విద్యార్థులకు "ప్లేస్ మెంట్ డ్రైవ్" నిర్వహించారు అందులో కళాశాలకు చెందిన 12 మంది ఎంపిక అయినట్టు గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. రామ్‌మోహన్ రెడ్డి తెలిపారు. ఎంపికైన 12 మంది విధ్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుర్ రఫీక్, రంగురత్నం, టీఎస్కేసి ప్లేస్ మెంట్ సెల్ కో అర్డినేటర్ డా. పి. రామ కష్ణ, టీఎస్కేసి మెంటర్ ఎస్. శ్రీకాంత్, రాములు అధ్యాపకులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలు పెంపొందిచేలా చర్యలు

- పూర్తి నివేదికలను క్రొడీకరించి సిద్ధం చేయాలి : కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో నీటి సంరక్షణ, భూ గర్భ జలాలు పెంపొందించే పనులకు సంబంధించిన పూర్తి నివేదికలను క్రోడీకరించి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నీటి సంరక్షణ, భూ గర్భ జలాలు పెంచే పనులు, ప్లాంటేషన్ లకు సంబంధించినవి, పూర్తి చేయబడిన, చేయవలసిన పనులను గుర్తించి పూర్తి నివేదికలను సిద్ధం చేయాలని అన్నారు. అక్టోబర్ 8 నుండి 10 వరకు జిల్లాలో జలశక్తి అభియాన్ కేంద్రం బందం పర్యటించనున్న సందర్భంలో సమావేశం ఏర్పాటు చేయడమైనదనీ తెలుపుతూ, జిల్లాలోని నీటి సంరక్షణకు సంబంధించిన నివేదికలను సంబంధిత శాఖల నుండి క్రోడీకరించి సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రామీణభివద్ధి అధికారి సురేందర్, జిల్లా పరిషత్ సీఈఓ చందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా భూగర్భ శాఖాధికారి సతీష్ , జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, మున్సిపల్ కమీషనర్ సుజాత, జిల్లా పంచాయతీ రాజ్ ఈ ఈ దుర్గా ప్రసాద్, జిల్లా ఉద్యానవన అధికారిని జ్యోతి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

జీవధాన్ ఘటన బాధాకరం

- సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయొద్దు
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని జీవధాన్ పాఠశాలలో జరిగిన ఘటన చాలా బాధాకరమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జీవధాన్ పాఠశాలలో ఆరేళ్ళ చిన్నారి పై లైంగిక దాడి కేసు విషయంలో లోతైన విచారణ చేపట్టి దోషిగా తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయమై జిల్లా ఇంఛార్జి మంత్రి ఆరా తీశారని, కొందరు ఆకతాయిలు సోషల్ మీడియాలో అమ్మాయి చనిపోయిందని దుష్ప్రచారం చేశారన్నారు. దీంతో పాఠశాలలో జరిగిన ఆందోళనలో కొందరు అల్లరి మూకలు పోలీసులపై రాళ్లదాడికి పాల్పడ్డారని, ఈ దాడిలో సీఐ చంద్రశేఖర్ రెడ్డి తలకు గాయం కాగా ఎస్సై రాజారాం, తీవ్ర అస్వస్థతకు గురయ్యారు, హెడ్ కానిస్టేబుల్ హజారుద్దీన్ కు కాలు విరిగిందన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై, సోషల్ మీడియాలో వదంతులు ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ, ఐజీలను కోరా మన్నారు.


మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

అమాయక యువకుల పై విద్యార్థుల కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేయొద్దని, అలా చేస్తే భవిష్యత్తులో వారికి ఉద్యోగాల విషయంలో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. పాఠశాలలో ఆందోళన నేపథ్యంలో పాఠశాల యాజమాన్యం సూచన మేరకు పిల్లలను తీసుకెళ్లడానికి వచ్చిన తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారన్నారు. కామారెడ్డి శాంతియుతంగా ఉందని, ఇది కమ్యూనల్ ఇష్యూ కాదన్నారు. కామారెడ్డి భవిష్యత్తుకు, అభివృద్ధికి కుల మతాలకు అతీతంగా అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు కైలాస శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు పండ్లరాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెం శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ అంజద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమమే ముఖ్యం

- హాస్టళ్లల్లో సమస్యలు పరిష్కరిస్తున్నాం : ఎస్‌డబ్ల్యూఓ రాజ గంగారాం
- నవతెలంగాణ కథనం పట్ల స్పందన


పెద్దకొడప్‌గల్‌లో హాస్టల్‌లో కిటికీలకు జాలీల ఏర్పాటు

నవతెలంగాణ ఎఫెక్ట్

నవతెలంగాణ-ఏర్గట్ల/పెద్దకొడప్‌గల్

నవతెలంగాణ పత్రికలో ఈ నెల 28 వ తేదీన శనివారం రోజు ప్రచురించిన"సంక్షేమ హాస్టళ్ళు సమస్యలకు నిలయాలు"అనే శీర్షికన వచ్చిన కథనానికి ఆర్మూర్ ఎ.ఎస్.డబ్ల్యూ.ఓ రాజ గంగారాం స్పందించారు. ఈ సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ... విద్యార్థుల శ్రేయస్సే తమకు ముఖ్యమని తెలిపారు. ఏర్గట్ల మండల కేంద్రంలోని ఎస్సి బాలుర వసతి గృహంలో సమస్యలు ఉన్నది నిజమేనని, భవనం పాతది అవడం వల్ల అక్కడక్కడ కొన్ని గదుల్లో పై కప్పు నుండి నీరు కారుతుందని, మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. అలాగే విద్యార్థులు ఉపయోగిస్తున్న బాత్ రూమ్ లకు ఈ ఆదివారం ప్లంబింగ్ పనులు ప్రారంభించినట్టు తెలిపారు. అలాగే వంట మనిషి భీంరావ్‌కు సమాచారం అందించడంతో ఆయన తిరిగి వచ్చారని, ప్రస్తుతం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని అన్నారు. హాస్టల్ లో ఉన్న సమస్యలను మొత్తం నివేదిక రూపంలో జిల్లా అధికారులకు పంపుతామని తెలిపారు. తన పరిధిలో 12 హాస్టళ్ళు ఉంటాయని, నెల రోజుల్లో ప్రతి హాస్టల్‌ను రెండుసార్లు సందర్శించి, విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటున్నట్టు తెలిపారు.

బెల్ట్‌షాపుపై దృష్టిసారించాం

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయి కేసులు, కల్లులో కలిపే ఆల్ఫాజోలం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. బెల్ట్ షాపులపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని, గత ప్రభుత్వం ఆదాయం కోసం బెల్ట్ షాపులను ఆదాయ వనరులుగా నడిపించిందని విమర్శించారు. రాబోవు ఐదేళ్లలో జిల్లాతో పాటు బాల్కొండ నియోజకవర్గన్ని అన్ని విధాలుగా, రంగాలలో అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఆధారాలు లేకుండా పోస్టు చేసిన వారిపై పరువునష్టం దావా వేస్తా

మండల వ్యవసాయ అధికారి లక్ష్మీకాంతరెడ్డి

నవతెలంగాణ-రెంజల్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రెంజల్ మండలంలోని వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు క్రాప్ డిజిటల్ సర్వేను పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ వారు సర్వేలో పాల్గొనకపోవడంతో జిల్లా వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేసినట్టు రెంజల్ మండల వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి సోమవారం తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న వ్యవసాయ విస్తీర్ణ అధికారుల జిల్లా యూనిట్ అధ్యక్షులు భాస్కర్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా యూనిట్ అధ్యక్షులు భాస్కర్ నాయక్ తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వాట్సాప్ గ్రూప్ లో క్లిప్పింగ్స్ పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. త్వరలోనే ఇట్టి విషయంపై పరువు నష్టం దావ వేయనున్నట్లు, ఆయనపై జిల్లా వ్యవసాయ అధికారికి, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించాలి

ఎస్పీ సింధుశర్మ సూచన

నవతెలంగాణ-నిజాంసాగర్/కామారెడ్డి

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సింధు శర్మ సోమవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో గల రికార్డులను పరిశీలించి రాత్రి సమయంలో పెట్రోలింగ్ అన్ని గ్రామాలలో విస్తృతంగా చేపట్టాలని ఆమె సూచించారు. దొంగతనాలు అరికట్టి ప్రతి గ్రామాలలో సీసీ కెమెరాలు పెట్టుకునేలా ప్రజలను మోటివేట్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బాన్సువాడ డిఎస్‌పి సత్యనారాయణ, ఎస్సై సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ

శేష జీవితాన్ని ఆరోగ్యంగా గడపాలి

కామారెడ్డి : పదవి విరమణ అనంతరం శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా గడపాలనీ జిల్లా ఎస్పీ సింధు శర్మ అన్నారు. కామారెడ్డి జిల్లా ఏఆర్ హెడ్ కోటర్స్ లో విధులు నిర్వహిస్తూ సోమవారం పదవి విరమణ పొందిన కె.కేశయ్య ని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పి సింధు శర్మ, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ... ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ అనేది తప్పనిసరి అని, సుమారు 34 సంవత్సరాలుగా నిజామాబాద్, కామారెడ్డి లో ఏఆర్ హెడ్ కోటర్స్ లలో విధులు నిర్వర్తించి హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొంది నేడు పదవీ విరమణ పొందుతున్న కేశయ్య పోలీసు శాఖకు అందించిన సేవలు మరువలేనివని వారి సేవలను కొనియాడారు. రిటైర్మెంట్ అనంతరం పోలీసు శాఖ నుండి రావలసిన అన్నిరకాల రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కె. నరసింహారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ జార్జ్, రిజర్వు ఇన్స్పెక్టర్లు నవీను సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

మంజులమ్మకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండలంలోని తన స్వగృహంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాతృ మూర్తి మంజులమ్మ సంవత్సరికం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజులమ్మ చిత్రపటానికి పలువురు మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హనుమంత్ షిండే, జాజుల సురేందర్‌తోపాటు డిసిసిబి చైర్మన్ రమేష్ రెడ్డి, నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.

అతిథి అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి



- ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న 1654 అతిథి అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి ఉద్యోగ భద్రత లేక పని చేసిన ఆరు నెలలకు ఒకసారి జీతాలు ఇస్తూ అతిథి అధ్యాపకులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజర్ చేయడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత వేతనం 42వేలు ఇస్తామని సాక్షాత్తు రాహుల్ గాంధీ జోడో యాత్రలో చెప్పారన్నారు. గెస్ట్ లెక్చరర్ల కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించి, ఫిక్స్ సాలరీ వచ్చే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి, సంబంధిత నాయకుల దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. కార్యక్రమంలో పలువురు గెస్ట్ లెక్చరర్లు పాల్గొన్నారు.

పండుటాకులకు ఆదరణ కరువు

- తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులు
- నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

భారతీయ దేశంలో సాంప్రదాయ పద్ధతులు విలువలు తల్లిదండ్రుల సంరక్షణలో ఎంతో ప్రాధాన్యతనిచ్చాయి. తరతరాలుగా వస్తున్న సాంప్రదాయాలను గౌరవిస్తూ పిల్లలు కన్నవారిని కంటికి రెప్పలా చూసుకునే వారు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దెబ్బతిన్న తర్వాత తమను కని పెంచిన వారి విషయంలో పిల్లలు నిర్లక్ష్యం చేస్తున్నారు. వృద్ధాప్యలో ఉన్న తల్లితండ్రులను పిల్లలు ఆదరించకపోవడంతో వారు తల్లడిల్లుతున్నారు. కొన్నిచోట్ల సీనియర్ సిటిజెన్ లందరూ కలిసి సంక్షేమ సంఘాలు ఏర్పాటు చేసుకుని కష్టసుఖాల్లో ఒకరినొకరు తోడుగా ఉంటున్నారు. నేడు ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నేపథ్యంలో ప్రత్యేక కథనం...

మనం నడవబోయే దారి వాళ్లు..

మనం బతకబోయే బతుకు వాళ్ల మనం నడవబోయే దారి వాళ్లు ఇప్పటి సమాజాన్ని మనకంటే ముందు స్వప్నించింది వాళ్లు దీని నిర్మాణానికి మనకంటే ముందు రాలెత్తిన వాళ్లు. చరిత్రకు ప్రత్యక్ష సాక్షులు వాళ్లు. మన పెద్దలు వయోవృద్ధులు ప్రతి అంశంలోనూ వాళ్లకు ఒక అనుభవం ఆలోచన ఉంటుంది. తనదైన దృష్టి కోణం ఉంటుంది. గతాన్ని భవిష్యత్తుతో ముడి వేస్తూ వర్తమానంతో జరిపే సంభాషణ వాళ్ళ జీవిత సారం. అయినప్పటికీ చరిత్రలో వయోధికులకు అందినంత ఆదరణ అందుతుందా అంటే ప్రశ్నార్థకమే. సాంకేతిక పరిజ్ఞానం అలనాటి అలవాట్లను అభిరుచులను మార్చేసింది. మూడు తరాల నాటి కుటుంబ బాంధవ్యాల సంఘటనలు కథలు ముచ్చట రూపంలో చెప్పే విధానం వినసొంపుగా ఉండేది.

1984 లో వయోవృద్ధులపై జరిగిన అంతర్జాతీయ సదస్సు..



లాలన వృద్ధాశ్రమం

పెద్దలపై నేటితరం చూపిస్తున్న వ్యవహార శైలిని పరిగణలోకి తీసుకొని అంతర్జాతీయ స్థాయిలో ఈ సమస్యను చర్చించి వృద్ధుల దినోత్సవాన్ని జరుపుకోవాలని ఆవశ్యకతను గుర్తించారు. మొట్టమొదటిసారిగా వియన్నాలో 1984 లో వయోవద్ధులపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. సీనియర్ సిటిజన్ అని పదం కూడా ఈ సదస్సులో మొదటిసారిగా వాడారు. మొదటిసారిగా 1991 అక్టోబర్ 1న ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నం, కన్నబిడ్డల స్వార్థం, మానవ విలువలు లోపించటం వంటివి ప్రస్తుతం వద్ధ తల్లిదండ్రులకు శాపంగా మారాయి. ఇలాంటి వారి కోసం కేంద్ర ప్రభుత్వం 2007లో తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం తెచ్చింది. 2019 లో ఈ చట్టానికి కేంద్రం మరిన్ని రక్షణ సవరణలు చేసిన అవి ఇంకా పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదు. వయోవృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎల్డర్లైన్ 14567 పేరిట హెల్ప్‌లైన్ నెంబర్‌ను అందుబాటులో ఉంచింది.

ఆదరణ లేక అల్లాడుతున్న వద్ధులు..

తమ పిల్లలు ప్రయోజకులు కావాలని రేయింబవళ్ల కష్టపడి పిల్లలను చదివించిన తల్లిదండ్రులు వారు ప్రయోజకులయ్యారని తెలిసి సంబరపడి పోతారు. ఆడపిల్ల అయితే ఓ అయ్య చేతిలో పెట్టి బాధ్యత తీర్చుకోవాలని కుంటారు. మగపిల్లల విషయంలో పెళ్లి చేయాలని తలుస్తారు. పెళ్లయిన తర్వాత మనమరాలు, మనుమడో పుడితే ఆ చిన్నారితో పొద్దు గడపాలని కలలు కంటారు. పెళ్లి చేసి తమ బాధ్యతను తీర్చుకుంటారు. తమ కొడుకులు తమకు దూరమయ్యే పరిస్థితులు వచ్చినప్పుడు సన్నగిల్లి పోతున్నారు.

బాధ్యతను మరుస్తున్న పిల్లలు..

కని పెంచిన వారి యోగక్షేమాలు చూసే వారి బాధ్యత తమదే నన్న విషయం మరిచిపోయి వ్యవహరించే వారూ ఉన్నారు. చాలా సందర్భాల్లో తల్లిదండ్రులు తమ పిల్లలు పట్టించుకోవడం లేదని తమకు కావలసిన వారికి చెప్పుకుంటున్నారు. వారి ద్వారా తమ పిల్లలతో మాట్లాడించే ప్రయత్నం చేస్తారు కాక మరికొందరు తమను పట్టించుకోవడం లేదంటూ పోలీస్ స్టేషన్ల గడప తొక్కుతున్నారు. తల్లిదండ్రుల ఆలనపాలన చూడాల్సిన కొడుకులు బాధ్యతను విస్మరించటం ఆందోళన కలిగిస్తుంది. తమ పిల్లల ఆదరణ కరువై ఎందరో తల్లిదండ్రులు తల్లడిల్లి పోతున్నారు. చివరి రోజుల్లోనైనా కన్న కొడుకు కరుణ లభిస్తుందని ఆశించిన పండుటాకులు అప్పుడు కూడా తమను పట్టించుకోనం కొడుకులను చూసి అల్లాడిపోవలసి వస్తుంది. వయోవృద్ధుల పోషణ చట్టం తెలిసిన తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను పోలీస్ స్టేషన్‌కు లేక కోర్టుకు రప్పించడం ఇష్టం లేక తమ చావేదో చస్తామంటూ అంటారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారి సంఖ్య పెరిగిపోతుంది. కనిపెంచిన తల్లిదండ్రులు వృద్ధాప్యంలోకి వెళ్లిన తర్వాత వారికి ఆసరాగా ఉండాల్సిన సంతానం బాధ్యత తమది కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.


నేడు జిల్లా కేంద్రంలో..

జిల్లా కేంద్రంలోని నూతన అంబేద్కర భవనంలో నేడు వయోవృద్ధుల దినోత్సవం ఆల్ పెన్షనర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించేందు కు ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారిని రసూల్ బి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలికి సన్మానం

మున్సిపల్ పరిధిలోని మామి డిపల్లిలో సీనియర్ సిటిజన్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో శతాధిక వృద్ధురా లు అయిన మంగలి సముద్రాల రాజు భాయ్ (105) కి సోమవారం ప్రపంచ వద్ధుల దినోత్సవం సందర్భంగా సన్మానించినారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, సీనియర్ సిటిజన్ సభ్యులు భూమన్న, పెదరాయుడు, ఆకుల నడిపి అన్న, మల్లెల పోశెట్టి, వెలుమల నడిపి మల్లయ్య, గొల్ల మైపాల్, పెద్ద గంగారం తదితరులు పాల్గొన్నారు.

బాధ్యత తమది కాదన్నట్లు వ్యవహరించడం సరికాదు..



మార గంగారెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్-అంకాపూర్,

కని పెంచిన తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో ఆసరాగా ఉండాల్సిన సంతానం బాధ్యత తమది కాదన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఇది ఏమాత్రం సరికాదు.

వృద్ధులకు 'లాలన'

మండలంలోని అంకాపూర్ గ్రామంలో గల గడ్డం సుశీల రాజిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గల లాలన వృద్ధాశ్రమం ఎంద రో వయోవృద్ధులకు ఆశ్రయం కల్పిస్తుంది. కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్, బోధన్ తదితర ప్రాంతాలకు చెందిన 60 మంది వృద్ధులు ఇక్కడ ఉంటున్నారు. గడ్డం రాజారెడ్డి ఆయన భార్య సుశీల జ్ఞాపకార్థం ఫౌండేషన్ ఏర్పాటు చేసి వయోవృద్ధుల సేవలో తరిస్తుంది. ఇటీవల ఆయన సైతం మరణించారు.

వృద్ధుల పట్ల చిన్నచూపు తగదు


వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్రనాథ్ సూరి

నవతెలంగాణ-మోపాల్

ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్, సీనియర్ సిటిజన్స్ ఫోరం విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ సహకారంతో సోమవారం మండల కేంద్రంలో మనోరమ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వృద్ధులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మల్లు స్వరాజ్యం ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ రవీంద్రనాథ్ సూరి ప్రారంభించి మాట్లాడారు. వృద్ధుల పట్ల సమాజం చిన్నచూపు చూడటం సరైంది కాదని, వృద్ధులకు ప్రభుత్వం అనేక హక్కులు కల్పించిందని తెలిపారు. వారసులు అర్థం చేసుకొని వారి సంక్షేమం చూడాలని ఆయన అన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. వృద్ధుల అనుభవాన్ని వినియోగించుకున్న వారు అభివృద్ధి పథంలోకి వెళ్తారని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ ఫోరం రాజా గౌడ్ మాట్లాడుతూ.. వృద్ధుల పట్ల వివక్షత ఉండకూడదని అన్నారు. పెన్షనర్ యూనియన్ నాయకులు మదన్మోహన్ ప్రసాద్ రావు వీడిసి నాయకులు జనార్ధన్, గోవర్ధన్, నవీన్ రెడ్డ, దమ్మడి గంగాధర్, మనోరమ ఆసుపత్రి డాక్టర్లు శరన్ రాజేష్, శివాని, నేహా వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈసీజీ, 2డి ఎకో, గుండె సంబంధిత టెస్టులు ఉచితంగా చేశారు. మందులు కూడా ఉచితంగా ఇచ్చారు. దాదాపుగా 250 మంది ఈ వైద్య శిబిరంలో పాల్గొన్నారు.

'ఫ్యూచర్ లైన్'లో బతుకమ్మ వేడుక


బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఉపాధ్యాయినులు, చిన్నారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో బతుకమ్మను తెలంగాణ రంగుల పూల పండుగగా జరుపు కుంటారని ఫ్యూచర్ లైన్ పాఠశాల అకాడమిక్ ఇంచార్జీ లత అన్నారు. తెలంగాణాలో ప్రసిద్ధి చెందిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఆర్య నగర్‌లో గల ఫ్యూచర్ లైన్ స్కూల్లో బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అకాడమిక్ ఇంచార్జీ లత మాట్లాడుతూ దసరా పండుగకు రెండు రోజులు ముందు సద్దుల బతుకమ్మగా ఆచరిస్తారన్నారు. వారం రోజులపాటు రంగురంగుల పూల పండుగను మహిళలు, చిన్నారులు ఆనందోత్సాల మధ్య ప్రతిరోజు సాయంత్రం ఈ ఆటలో నిమగ్నమై ఉంటారని తెలిపారు. ఇక చివరి రోజు రంగుల పూల బతుకమ్మను నీటిలో వదలడం ఆనవాయితీగా వస్తున్న ఆచరంగా జరుపుకుంటున్నట్లు వివరించారు. దీంతో నీటి కాలుష్యం నివారించవచ్చని అన్నారు. ఉపాధ్యాయినులు, విద్యార్థినిలు పూలతో బతుకమ్మ తయారుచేసి పాటలు పాడి పూల పండుగను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో శ్రీలత, గౌతమి, సంధ్య, జమున, సుమలత, , గౌతమి ఉపాధ్యాయ బందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కూరగాయల నారుకోసం దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఏర్గట్ల

ఉద్యాన శాఖ వారు రైతులకు ఉచితంగా అందించే టమాట, మిరప, గోపిగడ్డ, గోపి పువ్వు, వంకాయ నార్ల కోసం ఆసక్తి గల రైతులు నాటుకునే 40 నుండి 45 రోజుల ముందు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి వినాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో అతికొద్ది మంది రైతులు మాత్రమే కూరగాయల నార్లకు లబ్ధిపొందే అవకాశం ఉందని, లబ్ధిపొందిన రైతులు హైదరాబాద్ లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, జీడిమెట్ల ప్రాంతానికి వెళ్ళి నారు తీసుకోవాలని అన్నారు.

ఆంక్షలు లేకుండా 2 లక్షల రుణమాఫీ చేయాలి

- సహకార సొసైటీ సమావేశంలో తీర్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి


సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

అంక్షలు లేకుండా సహకార సొసైటీ పరిధిలోని రైతులందరికీ ఏకకాలంలో 2లక్షల రుణమాఫీ అమలు చేయాలని తీర్మానం చేశారు. సోమవారం ఖిల్లా డిచ్‌పల్లి మహాజన సభ సమావేశం నిర్వహించారు. సహకార సొసైటీ చైర్మన్ రాంచందర్ గౌడ్ మాట్లాడుతూ.. సహకార సంఘం పరిధిలో 13 గ్రామాలు 739 మంది రైతు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం సంఘం కృషి చేస్తుందని ఖరీఫ్ పంటలకు వరి ధాన్యం కనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బంది కలగకుండా భార్దన్, ఇతర సౌకర్యాలు, కూలీలను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. ప్రతి రైతు పండించిన వరి ధాన్యాన్ని కనుగోలు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా రైతులు పలు తీర్మానాలు చేశారు. సహకార సొసైటీ ఆధ్వర్యంలో రైతులందరికీ సన్నధాన్యానికి ప్రభుత్వం ద్వారా 500 రూపాయలు బోనస్ ఇవ్వాలని, రెండు లక్షల ప్రభుత్వ రుణమాఫీ కంటే ఎక్కువ రుణ ఉన్న రైతులకు సొసైటీ ద్వారా పూర్తిగా మాఫీ చేయడానికి ప్రభుత్వం అనుమతించాలని తీర్మానించారు.

ఇప్పటివరకు సహకార పరిధిలో రెండు లక్షల రుణమాఫీ ప్రభుత్వం ద్వారా 3 కోట్ల 72 లక్షల రూపాయలు 376 మంది రైతులకు అందించారని ఇంకా 336 మందికి రుణమాఫీ కావాల్సి ఉందని చైర్మన్ రామచంద్రగౌడ్ వివరించారు. ప్రభుత్వం మొత్తం రుణమాఫీ చేయాలని రైతులందరూ తీర్మానించినట్లుగా రాంచందర్‌గౌడ్ వేల్లాడించారు. డిచ్‌పల్లి గ్రామంతో పాటు ఈతర గ్రామాలలో ఖాళీ గోదాంలు మరమ్మతులు చేసి కొత్తగా నిర్మించడానికి రైతులు పేర్కొన్నారని తెలిపారు. సహకార సంఘం సొసైటీ చైర్మన్ రామచంద్ర గౌడ్ మాట్లాడుతూ.. పాత గోదాం స్థానాలలో కొత్తగా వ్యాపార సముదాయాలకు షట్టర్లు నిర్మించే ప్రతిపాదన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఖిల్లా డిచ్‌పల్లి సహకార సొసైటీ వైస్ చైర్మన్ కుమ్మరి గంగారం, డైరెక్టర్లు దాసరి రమేష్, బాలమల్లు సాయిలు, ఏలేటి సతీష్ రెడ్డి, ఎడ్ల శ్యాంసన్, సిఈఓ కిషన్, సహకార సొసైటీ సిబ్బంది సాయిలు, రైతులు, పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలి

- కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన

నవతెలంగాణ-కంఠేశ్వర్



జిల్లా కోర్టు ముందు నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశమై న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని తీర్మానించారు. అనంతరం జిల్లా కోర్టు ప్రధాన ద్వారం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని, ప్రభుత్వం తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో టెన్యూర్ పిపి నియామకం విధానాన్ని కొనసాగించాలని 41(ఎ) సిఆర్పిసి, 35 బిఎన్ఎస్ఎస్, సిఆర్పిసి అమెండ్మెంట్ చేయాలని వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, న్యాయవాదులు డాన్సల్ సురేష్, పిల్లిశ్రీకాంత్, ఎర్రం గణపతి, వి.భాస్కర్, శ్రీధర్, విశ్వక్ సేన్, ఆశ నారాయణ, భిక్షపతి, శివాజీ, భోస్లే సాయన్న జైపాల్ మహిళా న్యాయవాదుల కవితారెడ్డి, అంజలి తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజ అమ్ముతున్న వ్యక్తులు అరెస్ట్

- లక్ష తొమ్మిది వేల విలువైన మాంజా స్వాధీనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో చైనా మాంజా అమ్ముతున్నారని పక్కా సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ సిబ్బంది ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. పెద్ద బజార్ ఏరియాలో చైనా మాంజాను టాస్క్ ఫోర్స్ పోలీసు చెక్ చేయగా ఎన్‌కే షాప్ వద్ద ఇద్దరు వ్యక్తులు అమ్ముతున్నారని తెలిసి ఎన్‌కే కైట్స్ షాపులో వెతకగా రూ.లక్ష 9వేలు విలువగల చైనా మాంజా పట్టుకున్నారు. దీనిని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీడీవోకు తీవ్రగాయాలు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ ఎంపీడీవో మహ్మద్ ముజఫరొద్దీన్ సోమవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ముప్కాల్ బస్టాండ్ వద్ద బస్సులో నుంచి దిగిన ఎంపీడీవోకు అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు ఢీ కొనగా రోడ్డు ప్రమాదంకు గురయ్యారు. ప్రమాదానికి గురైన ఎంపీడీవోను వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు.

పోషణలోపం ఉండొద్దు

- అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పోషణలోపం ఏ ఊరిలోనూ ఉండకూడదని అంగన్వాడీ సూపర్వైజర్ ఎస్తేరు రాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో పోషణ అభియాన్ పోషణ పక్షం, పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీవో సతీష్ కుమార్ హాజరయ్యారు. అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించి తగు సూచనలను ఇచ్చారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ ఎస్తేరు రాణి మాట్లాడుతూ.. ఏ వయసులో ఎంత బరువు ఉండాలి.. ఏ వయసులో ఎంత ఎత్తు ఉండాలో తెలియజేశారు. పిల్లలు పుట్టినప్పటినుంచి ఐదు సంవత్సరాల వరకు తీసుకోవలసిన జాగ్రత్తలను, పౌష్టికాహారం గురించి తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి యూసుఫ్ ఖాన్, ఏపీఎం రవీందర్ రెడ్డి, ఏపీవో రవి, అంగన్వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయండి

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను దసరా, దేవి నవరాత్రులలో ఏర్పాటు చేయాలని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బుస్సా ఆంజనేయులు సోమవారం ప్రకటనలో తెలిపారు. దసరా దేవి నవరాత్రులలో గ్రామ గ్రామాన, వాడ వాడల్లో అత్యంత ఉత్సాహభరితంగా, ఉల్లాసభరితంగా నిర్వహించుకొంటు న్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తీవ్రమైన రక్తకొరత ఉన్న కారణంగా అన్నదానాలతో పాటే స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తే తలసీమియా పిల్లల ప్రాణాలను, అదే విధంగా డెంగ్యూ వ్యాధిన పడిన వారి ప్రాణాలు కాపాడిన వారమౌతామని తెలిపారు.

పూర్తి రుణమాఫీ అమలు చేసి 500 బోనస్ ఇవ్వండి

- ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా పూర్తిస్తాయిలో రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసి అన్ని రకాల పంటలకు క్వింటలకు 500 రూపాయలు బోనస్ ఇవ్వాలని అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అర్సపల్లిలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పంటలకు బోనస్ ఇస్తానన్న నేపథ్యంలో అదికూడా సన్నాలకే వర్తింపచేస్తామని చెప్పడంతో రైతులు అధిక సంఖ్యలో సన్నాలు వేశారని పంటకూడ చేతికి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే బోనస్ ప్రకటించి మద్దతు ధరతో కలిపి రైతుల ఖాతాలో క్వింటలకు 500 రూపాయలు బోనస్ వేయాలని భూమయ్య అన్నారు. కోతలు ప్రారంభమైన ప్రాంతాల్లో వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వారన్నారు. భోధన్ ప్రాంతంలో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారస్తులు పచ్చి వడ్లను కొనేందుకు వస్తున్నారని వారన్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో రెండు లక్షలు రుణ మాఫీ అమలు చేసి రాబోయే రబీ సీజన్ లోరైతులకు కొత్త రుణాలు అందించాలని వారన్నారు. ఎకరానికి 7500 ఇస్తానన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతు భరోసా హామీపై రైతులకు అనుమానం కలుగుతుందని వారన్నారు. ఇప్పటికైనా రైతు భరోసా ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు నాయకవాడి నర్సయ్య,ఉపాధ్యక్షులు కష్ట గౌడ్, సాయిలు నాయకులు గోపాల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

బంగారు పతకాలు సాధించిన లిటిల్ ఫ్లవర్ విద్యార్థులు


పతకం లిటిల్ ఫ్లవర్ విద్యార్థిని

నవతెలంగాణ-భీంగల్ రూరల్

భారత్ షోటో కాన్ ర్యూ కరాటే డు ఫెడరేషన్ ఇండియా వారు ఆదివారం హైదరాబాద్, బంజారాహిల్స్‌లో నిర్వహించిన నేషనల్ లెవెల్ ఓపెన్ టు ఆల్ స్టాల్ కరాటే, కుంగ్ ఫూ చాంపియన్ షిప్ 2024 కరాటే పోటీల్లో భీంగల్ పట్టణానికి చెందిన లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు విజయ దుందుభి మ్రోగించి బంగారు పతకాలు సాధించారు. అండర్ 11 కేటగిరిలో జి.అజంత ప్రియ, కె.నవ్యశ్రీ, ఎస్.మోక్షిత, సిహెచ్.లాస్య శ్రీ, జి.రసజ్ఞ, సిహెచ్.ప్రహర్షిత, జి.కతిక, డి.బాలస్వామి, పి.శ్రీహర్ష రుశ్విత్, బి.హార్దిక్, ఓ.మణికంత, డి.చందు, ఎస్.గౌరవ్‌లు బంగారు పతకాలు సాధించారు. వెపన్ విభాగం అండర్ 12 కేటగిరిలో ఎస్.మోక్షిత, జి.రసజ్ఞ, కే.నవ్యశ్రీ, జి.అజంత ప్రియలు కూడా బంగారు పతకాలు సాధించారు. టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ కే.విశ్వేశ్వర్, అన్సార్ అలీ వీరికి బంగారు పతకాలు అందించారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ షఫీ, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ సనా, ప్రిన్సిపాల్ రాధాకృష్ణన్ నాయర్, కరాటే మాస్టర్ టి.సురేష్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రకాష్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

దోమకొండలో ప్రజావాణికి అధికారుల డుమ్మా

నవతెలంగాణ-దోమకొండ

మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రేఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు గైర్హాజరు కావడం, ఆయా శాఖల అధికారులు సమయపాలన పాటించకపోవడంతో ఆయా గ్రామాల రైతులు, ఫిర్యాదు దారులు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. ప్రజావాణి కార్యక్రమానికి సీడీపీఓ, విద్యుత్ శాఖ అధికారులు, ఏఈలు, వసతి గృహాల వార్డెన్లు, ఆయాశాఖల అధికారులు గైర్హాజరవుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.



అధికారులు హాజరుకాకపోవడంతో ఖాళీగా కుర్చీలు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం స్వయం పారిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులు అయి బోధన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇంటర్ విద్యాధికారి షేక్ సలాం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జిల్లా ఇంటర్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ జయకుమారి విద్యార్థులను అభినందించి మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

డ్రైనేజీని సరిచేసిన అధికారులు



డ్రైనేజీని సరిచేయిస్తున్న అధికారులు

నవతెలంగాణ నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలోని నేషనల్ హైవే పనులు కొనసాగుతుడడంతో బస్టాండ్ ప్రాంతంలో మురికి నీరు పారే డ్రైనేజీ డ్యామేజయ్యింది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య, ఎంపీడీవో ప్రభాకర్ చారి పరిశీలించి డ్రైనేజీని సరి చేయించారు. రోడ్డుపై మురికి నీరు పారకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.

అర్జీదారుల సమస్యలు
పరిష్కరించేందుకే ప్రజావాణి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

అర్జీదారుల సమస్య పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వీకరించి, వాటిపై సంబంధిత అధికారులు పరిశీలించి చర్య తీసుకునే విధంగా సూచించారు. ప్రజల సమస్యలపై అధికారులు స్పందించి అర్జీదారునికి సమస్యపై సమాధానం అందజేయాలని సూచించారు. ఈ ప్రజావాణిలో (74) దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జడ్పీ సీఈవో చందర్ నాయక్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

శనగ విత్తనాలు పంపిణీ



శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న చైర్మన్ హన్మంత్‌రెడ్డి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చైర్మన్ హన్మంత్‌రెడ్డి చేతుల మీదుగా రైతులకు శనగ విత్తనాల బస్తాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు 500 శనగ బస్తాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒక బస్తా 25 కిలోలు టిఎస్, రకం రూ.2250, రూపాయలు ఎన్ఎస్ రకం రూ.2200 ధర ఉందని పేర్కొన్నారు. రైతులు ఆధార్ కార్డ్, పట్టా పాస్ పుస్తకాలు జిరాక్స్ వెంట తీసుకొని రావాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సంగారెడ్డి, సిఈఓ సందీప్ కుమార్, సంజీవ్ సంఘం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్‌గా అద్దంకి ఊషన్



నవతెలంగాణ-బోధన్

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా కన్వీనర్‌గా బోధన్ పట్టణానికి చెందిన అద్దంకి ఊషన్‌ని నియమించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూపురాణి సీతారాం సోమవారం తెలిపారు. వృద్ధుల సంక్షేమం గురించి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంలో పాల్గొంటూ వృద్ధులకు కావలసిన సహాయ సహకారాలను తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలిపారు. వృద్ధుల సంక్షేమం వారి ఆలనా పాలన చూడడం వారికి కావలసిన సేవలందించడం తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో జిల్లా కన్వీనర్‌గా నియమించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూపురాణి సీతారాంకు అద్దంకి ఊషన్ కృతజ్ఞతలు తెలిపారు. వృద్ధులకు తన వంతు సేవలు అందిస్తానని, వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన పేర్కొన్నారు.

బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే సురేందర్

నవతెలంగాణ-గాంధారి

కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీలతో గద్దెనెక్కిందని మాజీ ఎమ్మెల్యే సురేందర్ విమర్శించారు. గాంధారి మండల కేంద్రంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో కామారెడ్డి-బాన్సువాడ ప్రధాన రహదారిపై రైతులు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల మహా ధర్నాకు మద్దతిస్తూ ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొని మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా అర్హులైన రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో బూటకపు మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. అలాగే హైడ్రా పేరుతో డ్రామాలు వేస్తూ రైతులకు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఉద్యమాలకు పురిటి గడ్డ గాంధారి మండలం అని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామన్నారు. వరి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తానని మోసం చేసి ఇప్పుడు కేవలం సన్న వరికి మాత్రమే ఇస్తాననడం సరికాదన్నారు. రైతులను మోసం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు రైతులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

రిటైర్డ్ ఎంఈవోకు ఘన సన్మానం



రిటైర్డ్ ఎంఈవోను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు ఉద్యోగ విరమణ పొందడంతో పాఠశాల యాజమాన్యం సోమవారం ఆయనకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పిఆర్టియు మండల అధ్యక్షులు టి.సోమలింగంగౌడ్ మాట్లాడుతూ మండలంలో సుమారు 23 సంవత్సరాలుగా వివిధ బాధ్యతలను చేపట్టి అనేకమంది భావి భారత పౌరులను తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కట్ట ఆంజనేయులు, దూపల్లి ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు బి.వెంకటలక్ష్మి, పిఆర్టియు మండల అధ్యక్ష కార్యదర్శులు టి సోమలింగం గౌడ్, కిషోర్ కుమార్, మాజీ సర్పంచ్ శనిగరం సాయిరెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షులు లింగన్న యాదవ్, ఉపాధ్యాయులు కృష్ణ, నరేష్, రాజేశ్వర్ సాయన్న లక్ష్మీ దేవమ్మ, రాధా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని స్థానిక బిటియస్ వద్ద ఉన్న తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని దక్షిణ ప్రాంగణ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన సందర్భంగా మండలంలోని జంగంపల్లి గ్రామ నాయకులు సోమవారం సౌత్ క్యాంపస్‌లో శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అత్తెలి శ్రీనివాస్, మోహన్ రెడ్డి, ప్రవీణ్, సుమన్, క్యాంపస్ అధ్యాపకులు పాల్గొన్నారు.

రుణమాఫీపై సెక్రెటరీలను నిలదీసిన రైతులు

నవతెలంగాణ-పిట్లం

ప్రభుత్వం రెండు లక్షల రూపాయల వరకు రైతులకు రుణమాఫీ చేస్తున్నప్పటికీ తమకు రుణమాఫీ ఎందుకు వర్తించడం లేదని చిన్నకొడప్‌గల్, రాంపూర్ సెక్రటరీలు సంతోష్‌రెడ్డి, హన్మగౌడ్‌ను రైతులు నిలదీశారు. సోమవారం మండలంలోని చిన్నకొడప్‌గల్, రాంపూర్ సింగిల్ విండోల చైర్మెన్‌లు నాగిరెడ్డి, శపథంరెడ్డి అధ్యక్షతన సింగిల్ విండోల అర్ధవార్షిక నివేదిక సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల రుణమాఫీ కానీ సభ్యులకు సాంకేతిక లోపంతో మాఫీ కాలేదని సెక్రటరీలు సమాధానమిచ్చారు. రుణమాఫీ కానీ రైతుల రెండు లక్షల లోపు రుణాలను పూర్తిగా ఏకకాలంలో మాఫీ చేయాలని అన్నారు. ప్రభుత్వం సన్న రకం వరి ధాన్యానికి రూ.500 బోనస్ అందజేస్తామని ప్రకటించినట్లుగా దొడ్డు రకం వడ్లు పండించిన సంఘాల పరిధిలోని రైతులకు ప్రభుత్వం నుంచి రూ.500ల బోనస్ ప్రకటించాలని కోరారు. ఎల్‌టి అప్పులు పొందిన సభ్యులకు ఇపీ సౌకర్యం కల్పించాలని రైతుల డిమాండ్ చేశారు. అనంతరం స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండోల ఉపాధ్యక్షులు గోకన్ చిన్న సాయగౌడ్, డాకూరి వెంకట్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, చింతల సాయిరెడ్డి, జొన్న మోహన్‌రెడ్డి, క్లర్కు హన్మాండ్లు, సేల్స్‌మెన్ రవీందర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పలువురు

ఆప్టిట్యూడ్, రీజనింగ్‌పై టాస్క్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పిజెఆర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో ఆప్టిట్యూడ్, రీజనింగ్ పై టాస్క్ ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కళాశాల చైర్మన్ కే, గురువేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల యొక్క భవిష్యత్తుకు టస్క్ ఎంతో ఉపయోగకరమని టస్కు ద్వారా ఆప్టిట్యూడ్, రీజనింగ్ శిక్షణ తీసుకున్న విద్యార్థులు వేగంగా, వెంటనే ఉద్యోగాలు పొందుటకు అర్హత సాధిస్తారు అన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న టాస్క్ శిక్షకులు రఘుతేజ మాట్లాడుతూ ఈ సాంకేతిక యుగంలో విద్యార్థులకు ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగించుటకు సకాలంలో అట్టి ఉద్యోగాలు పొందుటకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె, విజయకుమార్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్, టస్క్ ఇన్చార్జిలు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే ఊరుకునేది లేదు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గీరెడ్డి మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై, ప్రభుత్వంపై అకారణంగా సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గిరెడ్డి మహేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడాలు చూపిస్తే, సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాల్సిన ప్రతిపక్షాలు, డబ్బులిచ్చి పోస్టులను పంపిస్తున్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై చట్టపరంగా శిక్షలు తప్పవని అన్నారు.

యువసేన యూత్ అసోసియేషన్ ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని యువసేన యూత్ అసోసియేషన్ కార్యవర్గాన్ని యూత్ సభ్యులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా బండ క్రింది రమేష్, అధ్యక్షునిగా ఎర్ర శ్రీనివాస్ (డిష్,) ఉపాధ్యక్షునిగా ఎర్ర శ్రీనివాస్ (ఆటో), కోశాధికారిగా కాటం రమేష్, కార్యదర్శిగా ఒంటరి సర్పారెడ్డి, సహాయ కార్యదర్శిగా పూర్ణచందర్, ప్రింట్, మీడియా ఇన్చార్జిగా తూర్పు శ్రీనివాస్, ప్రధాన సలహాదారులు బోల్ గేమ్ శ్రీనివాస్, కే చంద్రయ్య, దండ బోయిన గంగాధర్, లింగాల శ్రీకాంత్‌గౌడ్, తుపాకుల రామాగౌడ్‌ను ఎన్నుకున్నారు.



ఎన్నికైన యువసేన యూత్ అసోసియేషన్

పారిశుధ్య కార్మికుల
బకాయి వేతనాలు మంజూరు చేయాలి

- ప్రజావాణిలో వినతి

నవతెలంగాణ-ఎడపల్లి

నిజామాబాద్ జిల్లాలోని గ్రామపంచాయతీల లో పారిశుధ్య కార్మికులకు, సిబ్బందికి బకాయి వేతనాలను మంజూరు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ వెల్ఫేర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు, జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 9 నెలల బకాయి వేతనాలు కార్మికులకు, సిబ్బందికి రావాల్సి ఉందన్నారు. దసరా కానుకగా పారిశుధ్య కార్మికులకు జిపి సిబ్బందికి దుస్తులు పంపిణీ చేయాలన్నారు. జిపిలో కారోబార్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని తొలగించినందుకు గాను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన డిపిఓ పారిశుధ్య కార్మికులకు, సిబ్బందికి ఆగస్టు నెల మాసం వరకు బకాయి వేతనాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు జంగం గంగాధర్ తెలిపారు. పారిశుధ్య కార్మికులతో పాటు సిబ్బందికి దుస్తులను కొనుగోలు చేసి ఇవ్వాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించనున్నట్లు డిపిఓ తెలిపారు. అలాగే గ్రామపంచాయతీలో పని చేస్తున్న కారోబార్లను తక్షణమే విధుల్లోకి తీసుకుంటామని డిపిఓ హామీ ఇచ్చినట్లు జంగం గంగాధర్ తెలిపారు. డిపిఓను కలిసిన వారిలో సహాయ కార్యదర్శి సాగర్, జిల్లా ఉపాధ్యక్షులు జే పద్మ, పశువోద్దీన్, గంగారాం, సాయిలు, అశోక్, తదితరులున్నారు.



ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న పలువురు

నేషనల్ అసెస్మెంట్ సర్వే రెండవ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని వివిధ పాఠశాలల్లో సోమవారం నేషనల్ అసెస్మెంట్ రెండవ పరీక్ష నిర్వహించారు. పోసానిపేటలో సిఆర్‌పి మహమ్మద్ పరిశీలించారు. 3వ, 6వ, 9వ తరగతులకు విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని, నవంబర్లో ప్రత్యేక పరీక్షలు ఉంటాయని తెలిపారు.

పౌరహక్కులపై గ్రామస్తులకు అవగాహన

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని లక్ష్మీదేవినిపల్లి గ్రామంలో పౌరహక్కులపై గ్రామస్తులకు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని రెవెన్యూ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలయ్య మాట్లాడుతూ.. ప్రతి నెల చివరి తేదీ నాడు నిర్వహించే సివిల్ రైట్స్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులందరూ కులాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని, కులంతో దూషించకుండా సమానత్వం అనే భావనతో ఒకరికొకరు సహకరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుమలత, మాజీ సర్పంచ్ సుమలత, ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులు, తదితరులున్నారు.

పదవి విరమణ పొందిన అధికారికి సన్మానం



అధికారిని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామే శ్వర్ పల్లి గ్రామానికి చెందిన రమేష్ యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కో లిమిటెడ్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్ గా విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన సందర్భంగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి సోమవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అంకం రాజు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

మహిళా డిగ్రీ కాలేజీలో వరల్డ్ హార్ట్ డే



నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి (మర్కల్)లో వరల్డ్ హార్ట్ డేను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శోభారాణి అధ్యక్షతన జువాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ జువాలజీ కే వనజ ప్రస్తుతం మన జీవన విధానం, ఎదురవుతున్న ఒత్తిడిని అధిగమించే విధానం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పెంపొందింపచేసుకోవడం, వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ వారు అందిస్తున్న సేవలు, ఈ సంవత్సరం వారు ఇచ్చిన థీమ్‌ను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని హార్ట్ హెల్త్, కార్డియోవాస్క్యులార్ డిసీస్‌కి సంబంధించిన పేపర్ ప్రజెంటేషన్స్, పోస్టర్ ప్రజెంటేషన్స్‌ను అందజేశారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పేపర్ ప్రజెంటేషన్‌లో కె.చైతన్య, డి.నాగలక్ష్మికి మొదటి బహుమతి, నందినికి ద్వితీయ బహుమతిని అందజేశారు. అలాగే పోస్టర్ ప్రజెంటేషన్ ఇచ్చి, గెలుపొందిన విద్యార్థులు కే.వైష్ణవి మొదటి స్థానం, కే.రుచిత ద్వితీయ స్థానంలో, మాయావతి తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్స్ ఉదయిని, డాక్టర్ శ్రావణి, లైఫ్ సైన్సెస్ ఫ్యాకల్టీ డాక్టర్ ఉజ్మా సుల్తానా, పి.సింధూర, చంద్రకళ, అఫ్షా, నేహా, రచన, ఝాన్సీ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం

నవతెలంగాణ-కామారెడ్డి

సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాలలోని విద్యార్థులకు సహ చట్టం 2005 పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కామారెడ్డి పట్టణంలోని దేవనపల్లిలో (లింగంపేట్)లో గల సాంఘిక గురుకుల కళాశాల, పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి కళాశాల ప్రధానోపాధ్యాయురాలు వాణిరెడ్డి అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సహ చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి రోజుల్లో విద్యార్థులకు విద్యాతో పాటు వివిధ చట్టాలపైన అవగాహన అనేది ఎంతైనా అవసరమని తెలియజేశారు. బాలకార్మిక చట్టం, విద్యాహక్కు చట్టం 2009, ఇతర చట్టాల గురించి వివరించారు. సమాచార హక్కు చట్టం అనేది ప్రతి ఒక్కరికి వజ్రాయుధం లాంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల, పాఠశాల అధ్యాపక బృందం, సహ చట్ట పరిరక్షణ కమిటీ జిల్లా వక్త, న్యాయవాది శ్రీనివాస్ రావు, జిల్లా సలహాదారులు డి.లింగమయ్య, మహమ్మద్ ఆఫీస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి హాజరుకావాలని ఎంపీకి ఆహ్వానం

నవతెలంగాణ-భిక్కనూర్

మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్ర మానికి హాజరు కావాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కార్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజుతో కలిసి కోరారు. సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమ్ రెడ్డి, బిబిపేట్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు అంకం రాజు ఉన్నారు.



ఎంపీకి ఆహ్వానం పలుకుతున్న నాయకులు

చౌట్‌పల్లిలో విద్యార్థుల విజయోత్సవ ర్యాలీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం గ్రామస్తులు, యువజన సంఘాల సభ్యులతో కలిసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మండల అంతర పాఠశాల క్రీడోత్సవాల్లో 9 షీల్డులు, టోర్నమెంట్ ఓవరల్ ఛాంపియన్ షిప్ సాధించినందుకు సంతోషంతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. సభలో ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, ఫిజికల్ డైరెక్టర్ నాగేష్‌ను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎంఈవో ఆంధ్రయ్య మాట్లాడుతూ మండల క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ మూలంగానే అత్యధికంగా బహుమతులు గెలుచుకున్నామన్నారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం. కమల, సాయిప్రసాద్, బి. నరేష్, పాఠశాల సిబ్బంది, గ్రామ యువకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- యుఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజ్ రీయింబర్స్‌మెంట్, సంక్షేమ హాస్టల్స్ మెస్ బిల్లులు బకాయిలను వెంటనే విడుదల చేయాలని యుఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ యుఎస్ఎఫ్ నిజామాబాద్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏవో ప్రవీణ్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు దాదాపు 200 కోట్ల పైగా ఉన్నాయని, అలాగే ప్రభుత్వ ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ సంక్షేమ హాస్టల్ నందు దాదాపు మూడు కోట్ల వరకు మెస్ ఇతర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని లేనియెడల యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలను చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ నగర్ ఉపాధ్యక్షులు శివ, మహేష్, నాయకులు కృష్ణ, పవన్, తదితరులు పాల్గొన్నారు.

సేవచేసిన ఉద్యోగి గుర్తుండిపోతారు

- జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్

నవతెలంగాణ-ధర్పల్లి



ఉద్యోగ విరమణ చేసిన వారికి సన్మానం

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనేది సర్వసాధారణమని, కనుక ఉద్యోగులు తాము విధుల్లో ఉన్నప్పుడు ప్రజలకు మంచి సేవలు అందించినప్పుడే వారి గుండెల్లో నాలుగు కాలాల పాటు నిలిచి పోతామని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ఏర్పాటు చేసిన ఫార్మాసిస్టు కృష్ణ, పిహెచ్ఎన్ మేరీ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీలపై ఇతర చోట్లకు బదిలీ అయిన సిబ్బందికి జ్ఞాపికలను అందించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ శివ శంకర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుశాంత్ రెడ్డి, డాక్టర్ స్వాతి, డాక్టర్ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన జీపీ కార్మికులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నరేంద్ర మోడీ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా, గ్రామపంచాయతీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, 2016 అక్టోబర్ 26న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కార్మికులందరికీ పిఎఫ్ ఈఎస్ఐ చట్టాలను వర్తింపజేయాలని డిమాండ్తో ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాకు మండల గ్రామపంచాయతీ కార్మికులు వెళ్లినట్టు గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) మండల అధ్యక్షులు సొప్పరి గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో శేఖర్, సాయన్న, రాజన్న, గంగాధర్, సర్వర్ లక్ష్మి, గున్నావా, లక్ష్మణ్ , తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి ఆవిర్భావ దినోత్సవాలు : కేవీపీఎస్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 2నుంచి 5 తేదీ వరకు ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కొండగంగాధర్ తెలిపారు. సోమవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండగంగాధర్ మాట్లాడారు. 1998 అక్టోబర్ 2 న కెవిపిఎస్ ఆత్మ గౌరవం, సమానత్వం, కుల నిర్మూలన అనే లక్ష్యసాధన కోసం ఏర్పడిందన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం, స్మశాన స్థలాల జీవో నెంబర్ 1235, 200 యూనిట్లు వరకు ఉచిత కరెంటు జీవో నెంబర్ 342, కులాంతర వివాహాల ప్రోత్సాహకం 2.5 లక్షల జీవో 12 లను కెవిపిఎస్ పోరాడి సాధించిందని తెలిపారు. దళిత బంధు అర్హత గల వారికి ఇవ్వాలని, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, ఎస్సీ ఎస్టీ కమిషన్ కోసం చేసిన పోరాటాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యా యన్నారు. రాష్ట్రంలో ఏ మూలన దళితులపై చిన్న ఘటన జరిగిన స్పందిస్తున్న సంఘంగా కెవిపిఎస్ ముందుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ హాస్టల్ యందు సర్వే నిర్వహించి సంక్షేమ భవన్ హైదరాబాద్‌లో ప్రభుత్వానికి విన్నవించామని అన్నారు. కాస్మోటిక్ చార్జీలు రూ.2500 ఇవ్వాలని, నూతన భవనాలను నిర్మించాలని, బెడ్ షీట్లు, బాత్రూంలు సరైన విధంగా అందించాలని, వాటికి తగిన గ్రాంట్స్ విడుదల చేయాలని ప్రభుత్వానికి విన్నవించామని తెలిపారు. ప్రస్తుతం కులాంతర మతాంతర వివాహాలు చేసుకున్న వారికి పది లక్షల రూపాయలు ఇవ్వాలని రాష్ట్ర కమిటీ తీర్మానం చేసిందని అన్నారు. ఆవిర్భావ దినోత్సవాలను ప్రతి మండలంలో పండుగలా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు జిల్లా ఉపాధ్యక్షులు నలవాల నర్సయ్య పాల్గొన్నారు.

పాడే మోసిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలంలోని దుసగాం బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సతీష్ రెడ్డి అమ్మమ్మ పడిగెల గంగవ్వ (110) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ధర్పల్లి మాజీ జడ్పీ టిసి బాజిరెడ్డి జగన్ మోహన్ సోమవారం సందర్శించి భౌతిక కాయానికి పూలమాలవేసి, పాడేమోసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో సినీయర్ నాయకులు దాసరి లక్ష్మి నర్సయ్య, మాజీ మండలాధ్యక్షుడు శక్కరి కొండ కృష్ణ, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నీరడి పద్మారావు, ఒడ్డం నర్సయ్య, మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ నయిమ్, మాజీ సర్పంచ్ లింగం యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

పలువురుని పరామర్శించిన మానాల

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హసకొత్తూర్ గ్రామంలో సోమవారం రాష్ట్ర సహకార సంఘం చైర్మన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి పలువురిని పరామర్శించారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు బోర్గెం సుశీల భర్త ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పత్రి రాజేశ్వర్ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని కూడా పరామర్శించారు.పెద్ది నిఖిల్ అనే యువకుడు అనారోగ్యంతో చనిపోయాడు. వారి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పాలెపు లింగం కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ వెంట కమ్మర్ పల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట్ రవి, జిల్లా కిసాన్ కేత్ ఉపాధ్యక్షుడు పడిగెల ప్రవీణ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు మేకల క్రాంతి, జిల్లా సీనియర్ నాయకులు పడాల మల్లేష్, ప్రదీప్, ధర్మయ్య, సృజన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ట్రై కార్ చైర్మన్‌కు స్వాగతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ట్రై కార్ చైర్మన్ బేల్లయ్య నాయక్ సోమవారం జిల్లా నుండి వెళ్తుండగా మార్గ మధ్యలోని డిచ్‌పల్లి మండల కేంద్రంలో స్వాగతం పలికారు. ట్రై కార్ చైర్మన్ కు ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు చౌహాన్ మోహన్ నాయక్, ఎల్ఎస్ఓ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ జీవన్ నాయక్, ఎల్‌హెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విట్టల్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి తేజవత్ గంగాధర్ నాయక్, తదితరులు స్వాగతం పలికారు.

నలందస్కూల్లో వైద్య శిబిరం

నవతెలంగాణ-ఏర్గట్ల



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

మండల కేంద్రంలోని నలంద పబ్లిక్ స్కూల్ లో సోమవారం అనురాధ చిల్డ్రన్ హాస్పిటల్ మెట్ పల్లి వారి ఆధ్వర్యంలో పిల్లల వైద్య నిపుణులు పూదరి శ్రీనాథ్ గౌడ్ విద్యార్థులకు, చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన పిల్లలకు సుమారు 400 మందికి వైద్యం చేశారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మందులను అందజేశారు. అలాగే వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి 10 రోజుల వరకు ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ వెంకట్ గౌడ్,తుపాకుల శ్రీనివాస్ గౌడ్,వెంకటేష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్లల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-మెండోరా/బాల్కొండ/డిచ్‌పల్లి



మెండోరా: లిటిల్ ఫ్లవర్‌స్కూల్లో



బాల్కొండ: శాంభవి హైస్కూల్లో ..



ఆర్మూర్: ప్రజ్ఞకాన్సెప్ట్ స్కూల్లో..

మండలంలోని శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులోగల లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో సోమవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం, బతుకునిచ్చే అమ్మ బతుకమ్మ అని తీరొక్క పూలతో బతుకమ్మలను మహిళలు అలంకరించి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందని పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శివరాం ప్రసాద్, పాఠశాల సిబ్బంది క్రిష్ణ శ్రీ, శ్రావ్య, భారతి, రమ్య సుష్మ, అన్నపూర్ణ, ప్రణీత, ప్రసన్న, రాధిక, బ్యుల, కావ్య యాస్మిన్, సబ్రీన్, వేదవతి, సోనిక, ప్రమీల, సృజన, సరిత, భాగ్యలక్ష్మి నిషిత, కవిత, విద్యార్థిని విద్యార్థులు, పాల్గొన్నారు.

బాల్కొండ : మండల కేంద్రంలోని శాంభవి హై స్కూల్ ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ సంబరాలను పాఠశాల చిన్నారులు, ఉపాధ్యాయులు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాఠశాల నుండి పురవీధుల గుండా సద్దుల బతుకమ్మను ఊరేగిస్తూ గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు

డిచ్‌పల్లి : మండలంలోని సుద్దపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో సోమవారం బతుకమ్మ పండగ సంబరాలను నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా బతుకమ్మను పేర్చారు. గురుకులంలో బతుకమ్మ వేడుకలతో విద్యార్థుల్లో నూతన ఉత్తేజం ఉట్టి పడింది. కార్యక్రమంలో గురుకుల కళాశాల పాఠశాల ప్రిన్సిపల్ నళిని, వైస్ ప్రసిపల్ ఎం. స్వప్న, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ వనిత, ఉపాధ్యాయినిలు, విద్యార్థినుల తల్లులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలో మామిడిపల్లి ప్రజ్ఞ కాన్సెప్ట్ పాఠశాల, జెంటిల్ కిడ్స్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు కరస్పాండెంట్ ప్రజ్ఞ వంశీ రోమా, గుజరాతి ప్రకాష్, ప్రిన్సిపాల్ లత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ వేల ఏండ్ల చరిత్ర ఉన్నా పండగ అని దీని వెనుక అనేక కథలు ఉన్నాయని అన్నారు. తొమ్మిది రోజులు రోజుకో పేరుతో బతుకమ్మను కొలుస్తారని తెలిపారు. తొమ్మిది రకాల ఫలహారాలను సమర్పిస్తారని అన్నారు. విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు బతుకమ్మలను పేర్చి అలంకరించారు. సాంప్రదాయబద్ధంగా నృత్యాలతో బతుకమ్మ ఆడి అలరించారు.

అన్నప్రాసన, అక్షరాభ్యాసం

నవతెలంగాణ-ఆర్మూర్



సీమంతాలు చేస్తున్న ఏసీడీపీవో

పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ భవనంలో సోమవారం పట్టణ అర్బన్ సెక్టార్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. సామూహిక అన్నప్రాసన, అక్షరాభ్యాసం, సీమంతాలు సైతం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏసి డిపిఓ జ్యోతి మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు లభించే ఆహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. చిన్నారులను క్రమం తప్పకుండా అంగన్వాడి కేంద్రాలకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, మెడికల్ ఆఫీసర్ ఫిర్దోస్ ఫాతిమా, అంగన్వాడి సూపర్వైజర్లు నలిని, వెంకటరమణమ్మ, అంగన్వాడి టీచర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో విద్యార్థులు వ్యర్థ పదార్థాల నుండి కళాకృతులను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, సానిటరీ ఇన్స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నరసయ్య, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయునికి వీడ్కోలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



ఉపాధ్యాయున్ని సన్మానిస్తున్న పలువురు

హస కొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు డిఎల్ఎన్ చారి ఉద్యోగ విరమణ కార్యక్రమం సోమవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతన్, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ ముఖ్య అతిథిలుగా పాల్గొని ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని, ఉద్యోగిగా విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడంలో అందించిన నిస్వార్థ సేవలే ఉపాధ్యాయునికి పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తాయన్నారు. అనంతరం డిఎల్ఎన్ చారి దంపతులను పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. గతంలో ప్రధానోపాధ్యాయులుగా చారి పనిచేసిన ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల బృందాలు, గ్రామాభివృద్ధి కమిటీ, పూర్వ విద్యార్థులు, పలువురు మాజీ సర్పంచులు, ఉపాధ్యాయ బృందం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు కృష్ణ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల రుణమాఫీ చేయాలి

- బోర్గం(పి) మహాజన సభలో తీర్మానం



మాట్లాడుతున్న చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గం (పి) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం మహజన సభ సొసైటీ చైర్మన్, ఎన్‌డిసిసి బ్యాంక్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2 లక్షల రుణమాఫీ గురించి కూడా తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. తమ సంఘం పరిధిలో లావాదేవీలను సీఈఓ కృష్ణ వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు

జీపీ కార్మికులకు దుస్తులు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమం ద్వారా దుస్తులను ఎంపీడీవో సతీష్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ గంగాధర్ జూనియర్ అసిస్టెంట్ కారోబార్ వాటర్ మెన్ గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ విజేతగా విజయ్ హైస్కూల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్-2024, పోటీలు నాగారం, రాజారాం స్టేడియంలో ఈనెల 28న నిర్వహించారు. విజయ్ హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులు పి. లాస్యయాదవ్ 60 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ క్రీడలలో బంగారు పతకాలు, పి.శ్రీకృతి 600 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, లాంగ్ జంప్‌లో కాంస్య పతకం, ఎస్.అక్షయ షాట్‌పుట్‌లో కాంస్య పతకం, బాలుర విభాగం లాంగ్ జంప్ క్రీడలో పి.నీరజ్ కాంస్య పతకం, రెండు పతకాలు సాధించిన లాస్య యాదవ్‌కు వ్యక్తిగత చాంపియన్ షిప్ అవార్డు, అండర్-16 బాలికల విభాగపు ఓవరాల్ ఛాంపియన్ షిప్ అవార్డు విజయ్ హైస్కూల్‌కు లభించాయి. ఈ సందర్భంగా వివిధ పోటీలలో పతకాలు, అవార్డు సాధించిన విద్యార్థులను విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డా. అమృతలత ప్రత్యేకంగా అభినందించారు.

రక్తదానం గొప్పది

- అత్వంగ్ టోల్ ప్లాజా ఆధ్వర్యంలో శిబిరం



రక్తదానం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రక్తదానం మహాగొప్పదని ప్రతి ఒక్కరూ తమ వంతు రక్తదానం చేయడంతో ఆపదలో ఉన్న వారి కుటుంబాన్ని రక్షించిన వారవుతామని పలువురు పేర్కొన్నారు. సోమవారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని అత్వంగ్ టోల్ వే ప్రైవేట్ లిమిటెడ్ అద్వర్యంలో టోల్ ప్లాజా లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సంతోష్ కుమార్, ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్ కుమార్ సింగ్‌తో పాటు తదితరులు మాట్లాడుతూ.. రక్త దానంకోసం టోల్ ప్లాజాలో పనులు చేస్తున్న సిబ్బంది ముందుకు రావడం హర్షించదగ్గ విషయం అన్నారు. రక్తదానం ఒకరిదానం - మరొకరికి ప్రాణదానంతో సమానమన్నారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా మేనేజర్ చలపతిరావు, ఆపరేషన్ మేనేజర్ వీరజ్ దేశ్ పాండే, సేఫ్టీ మేనేజర్ సతీష్,టోల్ ప్లాజా ఇంచార్జ్ వీరబాబు, ఐతః రామారావు, సంతోష్ రెడ్డి, కృష్ణ కాంత్, ఉదయ్, గణేష్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్, వెంకట్ రెడ్డి, అనంద్ పాల్గొన్నారు.

డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ (పిఈటి,పిడి) విభాగాల్లో జిల్లా మొదటి ర్యాంక్



నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుడు ఏ. రాకేష్ రెడ్డి సోమవారం వెలువడిన డీఎస్సీ ఫలితాలలో స్కూల్ అసిస్టెంట్ (పిఈటి, పిడి) విభాగాల్లో నిజామాబాద్ జిల్లా మొదటి ర్యాంకు సాధించారు. ఆయన్ను గ్రామ ప్రజలు, యువకులు ప్రత్యేకంగా అభినందించారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని ఏలీయా నాయక్ తండా లో మిని గురుకుల హాస్టల్, మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ హాస్టల్ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ ఆకస్మికంగా సోమవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన పరిసరాలను పరిశీలించారు. మినీ గురుకుల పాఠశాలలో ఉన్న పరిస్థితులను సంతోషం వ్యక్తం చేశారు. హాస్టల్ కు గల అవసరాలను రాత పూర్వకంగా ఇస్తే పరిష్కరిస్తానని హామీ.ఇచ్చారు. అనంతరం కస్తూరిబా గాంధీ పాఠశాలను సందర్శించారు. అసంతృప్తిని వ్యక్తం చేశారు. హాస్టల్ లో గల సమస్యలు తెలపాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా ఐఏఎస్ అధికారి

నవతెలంగాణ-మాక్లూర్



ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ట్రైనీ ఐఏఎస్

ట్రైనీ ఐఏఎస్ అధికారి సంకెత్ కుమార్ మండల ఎంపీడీఓగా సోమవారం బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపి ఓ శ్రీనివాస్ అధికారులు పాల్గొన్నారు.

సత్తాచాటిన సుద్దపల్లి గురుకుల విద్యార్థినిలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిఎస్ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించిన సీనియర్ -19 వాలీబాల్ పోటీల్లో డిచ్ పల్లి మండలంలోని సుద్దపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల) పాఠశాల కళాశాలలో ద్వితీయ బహుమతిని గెలుపొంది 5వేల నగదు బహుమతి పొందినకుగాను కళాశాల ప్రిన్సిపాల్ టి. నళిని ఉపాధ్యాయ బందం సోమవారం హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

55 ట్రాక్టర్ల ఇసుక డంపులు సీజ్

- నేడు ఇసుక వేలం

నవతెలంగాణ-ధర్పల్లి



మండలంలోని దుబ్బాక గ్రామా శివారు ప్రాంతంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా ఇసుకను డంపు చేసినట్లు పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న తహసీల్దార్ బండారి మాలతీ సోమవారం ఇసుక డంపును స్వాధీనం చేసుకున్నారు. గ్రామ కార్యదర్శి, ఆగ్రాస్తులు ముగ్గురి సమక్షంలో మండల గిర్దావర్ పంచనామ నిర్వహించి సీజ్ చేసినట్లు తెలిపారు. ఇసుక డంపుల్లో సుమారు 55 ట్రాక్టర్ల ఇసుక ఉన్నట్లు గుర్తించారు. ఇసుక డంపులను అక్టోబర్ 01న తహసీల్దార్ కార్యాలయం నందు వేలం వేయనున్నట్లు అవసరం ఉన్న వారు వేలంలో పాల్గొనవలసిందిగా తహసీల్దార్ ఓ ప్రకటనలో తెలిపారు.

అక్రమార్కులెవరో తెలిసినా పట్టించుకోని అధికారులు

10 నెలల క్రితం నుండి దుబ్బాక గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమ ఇసుక దందా చేస్తూ టిప్పర్ల ద్వారా ఆర్మూర్, నిజామాబాదు, భీంగల్ ప్రాంతాలకు తరలించి లక్షలు కూడగట్టు కున్నట్లు తెలిసింది,. ఇందులో నాల్గు ఇసుక డంపులను కొందరు బేరంఆడగా కుదరక పోవడంతో గత 15 రోజులక్రితం పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. పట్టు కున్న ఇసుకను బహిరంగంగా అందరి ముందు వెలవెయ్యాలని ప్రజలు కోరుతున్నారు. సదరు అక్రమ ఇసుక వ్యాపారస్తుడు దుబ్బాక గ్రామప్రజలను ఇసుక వేలంపాటలో పాల్గొనవద్దని, కొందరు గ్రామస్థులతో కుమ్మక్కై వారికి సంబంధించిన వ్యక్తులే వేలంలో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిసింది. ఇతరులు వేలంలో పాల్గొనవద్దని హుకుం జారీచేసినట్లు తెలిసింది . అధికారులు నిజాయితీగా వేలం నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు. మండలంలోని మైలారం, రామడుగు, ధర్పల్లి, దమ్మన్నపేట్, రేకులపల్లి గ్రామాల్లో సైతం డంపులు ఉన్నాయని వాటిపై అధికారులు దృష్టి సారించాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బాసరలో మునిగి.. లోకేశ్వరంలో శవం లభ్యం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ధర్మారం (బి) గ్రామానికి చెందిన కోటగిరి జయ ఇటీవల తన తల్లి చనిపోగా కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం నిర్మల్ జిల్లా బాసర పుణ్యక్షేత్రంలోని గోదావరి స్నానానికి వెళ్లారు. మధ్యాహ్నం పుష్కర ఘాట్ వద్ద కోటగిరి జయ తమ్ముడి భార్య కష్ణవేణితో కలసి నదిలో దిగగా ఒక్కసారిగా నీళ్ల ప్రవాహానికి ఇద్దరు కొట్టుకు పోతుండగా కష్ణవేణిని దగ్గరలో ఉన్న జాలర్లు కాపాడారు. జయ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. గోదావరిలో కొట్టుకుపోయిన జయ ఆచూకీ కోసం జాలర్లు, పోలీసులు, కుటుంబ సభ్యులు గాలించారు. జయ మతదేహం లోకేశ్వర్ మండలంలోని వాస్తవంపూర్ వద్ద సోమవారం లభ్యమైంది. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి మర్చూరికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. మతదేహం లభ్యం కావడంతో ధర్మారం బి గ్రామంలో, కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మిత్ర ఐకానిక్ సెలూన్ ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



సెలూన్‌ను ప్రారంభిస్తున్న నరాల సుధాకర్

నగరంలోని వినాయక్ నగర్ ప్రాంతంలో వినాయకుల బావి వద్ద మిత్ర ఐకానిక్ సెలూన్‌నున ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయి బ్రాహ్మణ వత్తి చాలా కీలకమైనదని అన్నారు. కార్యక్రమంలో మిత్ర ఐకానిక్ సెలూన్ యజమాని నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జీ హనుమండ్లు, నాయి బ్రాహ్మణులు కడారి మోహన్, లింగంపల్లి సురేందర్, దేశాయి గంగాధర్, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

జహీరాబాద్ ఎంపీ కలిసిన పలువురు



ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పలువురు నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంను కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల భాగయ్య, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కొత్తొల్ల గంగారం, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల బాబు, జిల్లా గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి మల్లన్న, జిల్లా ఉపాధ్యక్షులు దుబాసి నరేందర్, సంఘీ ప్రవీణ్, అంబేద్కర్ జన సంఘం టౌన్ ప్రెసిడెంట్ కామారెడ్డి నీరడి నారాయణ, జిల్లా కార్యదర్శి సుంకరి సంజీవ్, బంటు సాయిలు, అంబేద్కర్ సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ఎంపీ మల్లు రవి

నవతెలంగాణ-భిక్కనూర్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి అన్నారు. సోమవారం ఆర్మూర్ వెళ్తూ మండల కేంద్ర శివారులోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు వెంకన్నగారి బాగారెడ్డి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని, గత ప్రభుత్వ హాయంలో అక్రమాలకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా ఏర్పాటు చేసి సాహస నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ పెట్రోల్ బంక్ యజమాని సహదేవ్ ఉన్నారు.

రుణమాఫీ చేయాల్సిందే

- అన్ని రకాల వరిపంటకు రూ.500 బోనస్ ఇవ్వాలి
- రైతు భరోసానూ అందజేయాలి
- పలు సొసైటీల మహాజన సభల్లో రైతుల డిమాండ్



వర్ని : చందూర్ మహజన సభలో పాల్గొన్న రైతులు



నిజాంసాగర్ : మల్లూర్‌లో..

నవతెలంగాణ-విలేకరుల బృందం

అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొందరికి మాత్రమే రుణమాఫీ చేసిందని.. అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. అలాగే అన్ని రకాల అన్ని రకాల వరిపంటకు రూ.500 బోనస్ ఇవ్వాలని, రైతు భరోసానూ అందజేయాలని అన్నారు. ఈ మేరకు సోమ వారం పలు సొసైటీల మహాజన సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా పై అంశాలపై తీర్మానం చేశారు.

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చైర్మన్ హన్మంత్‌రెడ్డి అధ్యక్షతన మహాజన సభ సమావేశం నిర్వహించారు. సొసైటీ ద్వారా కొనుగోలు చెల్లింపు, రైతులకు ప్రభుత్వం చేసిన రుణమాఫీ, రైతులకు తిరిగి ఇచ్చిన రుణాల వివరాలను సొసైటీ సిఈఓ సందీప్ కుమార్ చదివి వినిపించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు పలు తీర్మానాలను చేశారు. ఇందులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీని ఏకకాలంలో చెయ్యాలన్నారు. వర్ష కాలంలో రైతులు పండించిన అన్నీ రకాల వరి పంటలకు రూ.500 బోనస్ అందించాలని కోరారు. రైతులకు రైతుబంధు ఇవ్వాలని, అదేవిధంగా రైతులకు రైతు భరోసా అందజేయాలని, రైతులు పండించిన సోయా పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని మహాజనసభలో తీర్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సంగారెడ్డి, డైరెక్టర్లు, సీఈవో సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ బోనస్‌ను వర్తింపచేయాలని నీలా సింగిల్విండో చైర్మన్ స్పష్టం చేశారు. మండలంలోని నీలా సొసైటీ ఆవరణలో చైర్మన్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలోని జమ ఖర్చులను చదివి రైతులకు వినిపించారు. ఆధార్ కార్డులో ఒక పేరు, రుణ ఖాతాలో మరో పేరు ఉండడంతో బ్యాంకు రుణమాఫీ రైతులకు కాలేదని, వీటి సవరణ కోసం బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి చొరవ చూపి రైతులకు రుణమాఫీ అయ్యేలా చూడాలని వారు కోరారు. ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీని వర్తింపజేయాలని వారన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ మీర్జా సలీం బేగ్, షేక్ ఆఫీజ్, మదారి, నూనెల ఆకాష్, లాయక్ అలీ ఖాన్, నిస్సార్ బిగ్, రైతులు సుభాష్, రాఘవేందర్, ఖలీద్ బేగ్, గంగా కిషన్, భాస్కర్, సీఈఓ రాందాస్, సిబ్బంది శంకర్ అర్బాజ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సమగ్ర సేవలందించడమే లక్ష్యం..

బోధన్ : రైతులకు ఎరువులు, విత్తనాలతో పాటు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను దరిచేరేలా సమగ్ర సేవలందించడమే సొసైటీ లక్ష్యమని సాలూర సొసైటీ చైర్మెన్ అల్లె జనార్దన్ అన్నారు. సొసైటీ ఆవరణలో జరిగిన మహాజన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాలూర సొసైటీ పరిధిలో రైతులు పంట మార్పిడి విధానంలో కూరగాయల సాగుకు ముందుకు వస్తే వారికి సొసైటీ ద్వారా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. అలాగే 50శాతం సబ్సిడిపై మందు స్ప్రే చేసే పంపులు అందించడానికి ప్రణాళిక చేపడుతున్నామని అవసరమైన రైతులు ముందుకు రావాలని సూచించారు. త్వరలో సోయా, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. అంతకుముందు సొసైటీ సీఈఓ బస్వంత్ రావు పటేల్ లావాదేవీలను, జమ ఖర్చులను సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ సందీప్ లెడ్డి, డైరెక్టర్లు బచ్చు సాయిలు, సంగెపు భూమయ్య, ముట్టెన్ గంగారాం, హెుట్లప్పా రైతులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. అర్హులైన వారికి రుణమాఫీ..

భిక్కనూర్ : రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందవద్దని అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ ప్రభుత్వం చేయనున్నట్లు జంగంపల్లి సొసైటీ చైర్మన్ సిద్ధ రాములు తెలిపారు. గ్రామంలోని సొసైటీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర అందజేస్తుందని, విత్తనాల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం రైతులు మాట్లాడుతూ.. రైస్ మిల్లులలో తరుగు తీయడం, కల్లాల సమస్యలు, ఇతర రైతుల సమస్యల గురించి సభాదృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని సొసైటీ పాలకవర్గం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాసు, సొసైటీ డైరెక్టర్లు, మాజీ సర్పంచ్ నర్సింలు యాదవ్, విడిసి చైర్మన్ శివలింగం, రైతులు, సొసైటీ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని పద్మాజీవాడి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మహాజన సభను చైర్మెన్ గంగాధర్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యదర్శి దేవందర్ ఆదాయ వ్యయాలను రైతులకు చదివి వినిపించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కుంట శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు రైతులు పాల్గొన్నారు.

బీబీపేట్ : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ కమిటీ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అధ్యక్షతన మహాజన సభ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ జిల్లా వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, మాజీ ఎంపీపీ బాలమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను సభా దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడొద్దు..

నిజాంసాగర్ : రైతులు అధైర్య పడొద్దని అందరికీ రుణమాఫీ అవుతుందని సొసైటీ చైర్మెన్ కళ్యాణి విఠల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లూరు సింగిల్ విండో సొసైటీ చైర్మన్ కళ్యాణి విఠల్‌రెడ్డి అధ్యక్షతన సొసైటీ కార్యాలయం ఆవరణలో మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంఘం సభ్యుల సహాయ సహకారాలతో సొసైటీ నడిపిస్తున్నామని తెలిపారు. రుణమాఫీ కానీ రైతులు పేర్లు, ఆధార్ నంబర్లు సరిగ్గా ఆన్లైన్లో నమోదు చేయకపోవడంతోనే రుణమాఫీ ఆగిందని తెలిపారు. సన్నం వడ్లకే కాకుండా దొడ్డు వడ్లకు కూడా 500 బోనస్ వర్తింప చేయాలంటూ తీర్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రామ్‌సింగ్, డైరెక్టర్లు బుడమే గంగాధర్, కొత్తపల్లి విఠల్, సప్పటి నారాయణ, కోతి భూమవ్వ, అడ్డగల భూమేష్, సతేలి అంజయ్య, వెంకట్ రెడ్డి, సైనోద్దీన్, సాయిలు, విఠల్ రెడ్డి, చింతల్ నర్సింలు, సంఘం సీఈఓ కోటగిరి సాయిలు, నాయకులు మాజీ వైస్ ఎంపీపీ మనోహర్, పెద్ది హనుమాన్లు, బుడిమే శ్రీనివాస్, ఒంటరి శ్రీనివాస్ రెడ్డి, ఒంటరి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చందూర్ సోసైటీలో మహాజన సభ..

వర్ని : చందూర్ గ్రామ సహకార సంఘం మహాజన సభ చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్ సమక్షంలో నిర్వహించారు. సొసైటీ కార్యదర్శి భూమయ్య 6 మసాల సంబంధిత లావాదేవీలు, వ్యాపార లాభ నష్టాలు, జమ ఖర్చుల అంశాలను రైతులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ సంఘం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేయడానికి నిధుల ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మాధవ రెడ్డి, కొత్తల శ్రీనివాస్‌రెడ్డి, రుక్మిణి రాంరెడ్డి, మేడిపల్లి సాయిలు, జూకటి లక్ష్మి, నీరడి బాలయ్య, అంగోత్ శంకర్, బ్యాంక్ మేనేజర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాగన్నగారి బావిని సందర్శించిన విద్యార్థులు



బావిని సందర్శించిన విద్యార్థులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని చారిత్రకట్టడమైన నాగన్నగారి బావిని పిట్లం పాఠశాల చెందిన విద్యార్థులు సోమవారం సందర్శించారు. అలాగే మండల కేంద్రంలోని ప్రసిద్ధి చెందిన నగరేశ్వర ఆలయం ముందు గాలికి ఊగే గజ స్తంభాన్ని సందర్శించారు. చరిత్రను భావితరాలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సబ్ కలెక్టర్‌కు సన్మానం

నవతెలంగాణ-బోధన్

సబ్ కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వికాస్ మహతోను దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పూలమాలలతో సోమవారం ఘనంగా సన్మానించారు. సబ్ కలెక్టర్‌ని కలిసిన వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మందుగుల విద్యాసాగర్, గోసంగి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంధం రాజేష్, ఎస్సి, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మనిటరింగ్ కమిటి మెంబర్ రామకృష్ణ, మాల మహానాడు అధ్యక్షులు రేకం దాస్, బాలరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉప్పాల రామకృష్ణ, నాగరావు, మహేందర్, నాంపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ 14వ వార్షికోత్సవం, శ్రీ సద్గురు సచ్చిదానంద స్వామి 20వ వార్షికోత్సవ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. 30న ప్రారంభమైన వార్షికోత్సవ వేడుకలు అక్టోబర్ 2వ తేదీ సాయంత్రంతో ముగుస్తాయని సాయిబాబా ఆలయ వ్యవస్థాపకులు వెంకటేశ్వర శర్మ తెలిపారు.

పూజారులకు సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

ప్రతి సంవత్సరం లాగా ఈ ఏడాది కూడా తిరుపతి జెండా మహారాష్ట్ర నుంచి మద్నూర్ మండల కేంద్రానికి చేరుకొని మండల కేంద్రంలోని గాంధీ చౌక్ ఆవరణంలో 11 రోజులపాటు పూజలు అందుకుంది. ఈ సందర్భంగా పూజారి వెంకట మహారాజ్‌ను రథంగల్లి శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయ తాత్కాలిక కమిటీ ఆధ్వర్యంలో పూజారులకు శాలువాలతో ప్రత్యేకంగా సన్మానించారు.

బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలని, అన్ని ఆర్టీసీ డిపోలకు చెందిన బస్సులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా సమాచార హక్కు చట్టం ప్రతినిధి గంగల రవీందర్ ఎమ్మార్వో శివప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. బస్టాండు ఆవరణలో మూత్రశాలలు లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు ప్రతినిధులు సాయి నిఖిల్, రాజు ఉన్నారు.

గ్రామ మంచినీటి సహాయకులకు

మూడోరోజు శిక్షణ

నవతెలంగాణ-రెంజల్

మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు సోమవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బోరు మోటర్లలో ఉపయోగించిన పరికరాల వివరాలను తెలియజేస్తూ రిసోర్స్ పర్సన్‌లు శిక్షణ ఇచ్చారు. బోరు మోటర్లు నడవడానికి చిన్న చిన్న సమస్యలు ఎలా పరిష్కరించుకోవాలో సూచించారు. వాటర్‌మెన్‌లు తమ సొంత ఆలోచనలతో కరెంటుతో ఎలాంటి పొరపాట్లు చేయకుండా జాగ్రత్తగా నడుచుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, మండల పాలనాధికారి హెచ్.శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ ముని నాయక్, ఏఈ గబ్బర్ సింగ్, రెంజల్, ఎడపల్లి మండలాల మంచినీటి సహాయకులు, మిషన్ భగీరథ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినోత్సవం

నవతెలంగాణ-నిజాంసాగర్

గ్రామీణ స్థాయిలో కులవర్గ విభేదాలు లేకుండా ప్రజలందరూ కూడా అన్న తమ్ముడు వలె కలిసి ఉంటున్నారా లేదా అని ప్రతినెల చివరన మండల పరిధిలోని ఓ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని చేపట్టనున్నట్టు నిజాంసాగర్ ఏఎస్ఐ రాజేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంసాగర్ మండలంలోని కొమ్లంచ గ్రామంలో కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా కులం పేరుతో, వర్గం పేరుతో గాని ఎవరైనా దూషిస్తున్నారా అని ఆయన వారిని అడిగి తెలుసుకున్నారు. అలాంటి వాటికి పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటారని ఆయన గ్రామంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తా

- జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతారావు



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీ కాంతారావు అన్నారు. మండల కేంద్రానికి ఇరువైపులా 161వ జాతీయ నాలుగు లైన్ల రహదారి బైపాస్ రోడ్డు వరకు బిటి డబుల్ రోడ్డు పనులను ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హనుమాన్ స్వామి, వట్నాల రమేష్, కొండ గంగాధర్, సచిన్, నాగేష్ పటేల్, పరమేష్ పటేల్, హనుమంతు యాదవ్, సంతోష్ మేస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవి..

గ్రామాల శుభ్రత పట్ల, గ్రామ ప్రజల ఆరోగ్యాలను కాపాడడంలో పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యమైనవని ఎమ్మెల్యే తోటా లక్ష్మీ కాంతారావు అన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాల్లో భాగంగా ఉమ్మడి మండల పరిధిలోని గ్రామపంచాయతీ మల్టీపర్పస్ పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరాన్ని మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాణి, మండల తహసీల్దార్ ఎండి ముజీబ్, ఎంపీఓ వెంకట నరసయ్య, ఎంఈఓ రాములు నాయక్, ఏపీవో పద్మ, ఏపీఎం మనోహర్, గ్రామ కార్యదర్శుల యూనియన్ నాయకులు భాస్కర్, మండల నాయకులు ప్రమోద్, డోంగ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యద ర్శులు, గ్రామపంచాయతీ మల్టీపర్పస్ పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం..

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదామని అనే నినాదాన్ని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు ప్రజలకు పిలుపునిచ్చారు. మొక్కలు నాటే వాటిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నాగరాజ్, ఎంపీడీవో రాణి, ఎంపీఓ వెంకట నరసయ్య, ఏపీవో పద్మ వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ..

మండలంలోని ఎడ్గి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో ఒకరు, రోడ్డు ప్రమాదంలో ఇంకొకరు మరణించడంతో ఈ విషయం తెలుసుకున్న జుక్కల్ ఎమ్మెల్యే, నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామ ర్శించారు. ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య రక్షణకు సీఎం రిలీఫ్ ఫండ్..

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాల పట్ల ప్రత్యేకంగా కృషి చేస్తుందని, ప్రజలు అనారోగ్యంతో ఆసుపత్రుల్లో లక్షలాది రూపాయలు పెట్టిన ఖర్చులకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వార అందజేస్తున్నారని ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతా రావు తెలిపారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే, కార్యక్రమంలో పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.



బోధన్: సాలూరాలోని ప్రజ్ఞశ్రీ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు, టీచర్లు



భిక్కనూర్ : సిద్ధార్థ పాఠశాలలో చిన్నారులు

బతుకమ్మ పండుగొచ్చె

పలుచోట్ల పూల పండుగ వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

బతుకమ్మ పండుగ వేడుకలను ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలలతో పాటు.. ఇతర చోట్ల సోమవారం నిర్వహించారు. పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు.

బోధన్ : బతుకమ్మ పండగ వారోత్సవాలను పురస్కరించుకుని బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో విద్యార్థులు, మహిళ ఉపాధ్యాయులు పూల పండుగ బతుకమ్మ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగురంగుల



పూలతోట బతుకమ్మ పేర్చి బతుకమ్మ పాటలకు లయబద్ధంగా ఆడిపాడారు. విద్యార్థులు, మహిళ ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాటలు పాడుతూ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం బతుకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి సమీపంలోని బావిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులు స్నేహ, కామేశ్వర్, కళ్యాణి, జ్యోతి, వనిత, వసుధ, శాంతి, అరుణ, మాజీ కౌన్సిలర్ ప్రభావతి విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయివేటు విద్యాసంస్థల్లో..

బతుకమ్మ సంబరాలను బోధన్, సాలుర మండలాల్లో గల ప్రైవేట్ విద్యా సంస్థలలో విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. బోధన్ పట్టణంలోని ఇందూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినిలు, మహిళా ఉపాధ్యాయులు రంగురంగుల పూలను పేర్చి బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. బతుకమ్మ డీజే పాటలకు లయబంధంగా నృత్యాలు చేస్తూ ఆడి పాడారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధి లక్ష్మి, కరస్పాండెంట్ కోడలి కిషోర్, ముఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే సాలూర మండల కేంద్రంలోని ప్రజ్ఞశ్రీ హైస్కూల్లో నిలువెత్తు బతుకమ్మను ఏర్పాటు చేసి దాని చుట్టూ గొబ్బియలాడుతూ విద్యార్థులు, మహిళ ఉపాధ్యాయులు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. బతుకమ్మ పాటలతో పాఠశాల ప్రాంగణం మారుమోగింది. విద్యార్థుల కేరింతలు, బతుకమ్మ పాటలతో పండగ వాతావరణం నెలకొంది. అనంతరం సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.



భిక్కనూర్ : సిద్ధార్థ పాఠశాలలో చిన్నపెద్ద

కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లతా రాజు, పాఠశాల డైరెక్టర్ రాజు, హెచ్ఎం భవాని, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్ధార్థ పాఠశాలలో..

భిక్కనూర్ : పట్టణ కేంద్రంలోని సిద్ధార్థ పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో టీచర్లు, విద్యార్థినిలు బతుకమ్మ ఆడారు. పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్, ప్రిన్సిపాల్ శ్రీకాంత్ మాట్లాడారు. సంప్రదాయ పండుగలను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో..

కామారెడ్డి : కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 9, 11వ వార్డ్ లింగాపూర్ గ్రామంలో నిర్వహించిన సెక్టార్ మీటింగ్‌లో భాగంగా అంగన్వాడీ టీచర్లు బతుకమ్మలను పేర్చి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ కొమురవ్వ, సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ టీచర్స్, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి: బతుకమ్మ ఆడుతున్న అంగన్‌వాడీ టీచర్లు



భిక్కనూర్‌లో...



బోధన్ : జేసీ హైస్కూల్‌లో బతుకమ్మలతో టీచర్లు

కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ కామారెడ్డి వారి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించినట్టు మండల వైద్యాధికారి హిమబిందు తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు హరికిషన్, రోటరీ క్లబ్ కామారెడ్డి అధ్యక్షులు రాజా నరసారెడ్డి, సిహెచ్ఓ రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషయ్య, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు ఉన్నారు.

పట్టభద్రుల, టీచర్స్ శాసన మండలి సభ్యుల ఎన్నికలకు ఓటర్స్ గా దరఖాస్తు చేసుకోండి

- **తహసీల్దార్ ఎమ్‌డీ ముజీబ్**

నవతెలంగాణ-మద్నూర్

మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల, టీచర్స్ నియోజకవర్గాలకు శాసన మండలి సభ్యుల ఎన్నికల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎమ్‌డీ ముజీబ్ సోమవారం తెలిపారు. సంబంధించిన ఓటర్ల జాబితాను ఎన్నికల ముందు ప్రతిసారీ కొత్తగా సిద్ధం చేయాల్సి ఉన్నందున, ఈ నియోజకవర్గాలకు సంబంధించి ఇప్పటికే ఉన్న సాధారణ ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్న వ్యక్తులందరూ కూడా నిర్ణీత ఫారమ్‌లో తాజా దరఖాస్తులను సమర్పించుకోవాలని సూచించారు.